ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

కృష్ణా జిల్లా వార్తలు

గురువారం 14 నవంబరు 2024





మచిలీపట్నంలో పాండురంగ స్వామి రథోత్సవం (ఇన్‌సెట్‌లో) స్వామి వారు

వైభవంగా పాండురంగ స్వామి రథోత్సవం

మచిలీపట్నంలో పాండురంగ స్వామి రథోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. పూలతో ప్రత్యేకంగా ముస్తాబు చేసిన వాహనంపై స్వామి వారి ఉత్సవ మూర్తులు కొలువుదీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు పట్టణంలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

6లో

దుర్గా కో-ఆపరేటివ్ బ్యాంకు లైసెన్స్ రద్దుతో ఆందోళన



వన్‌టౌన్‌లోని బ్యాంక్‌కు ఖాతాదారుల క్యూ

- వివరాలు తెలుసుకున్న డిపాజిట్‌దారులు
- అన్యాయం జరగదు : సెక్రటరీ బంకా శ్రీనివాసరావు

వన్‌టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లైసెన్స్ రద్దుతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. వన్‌టౌన్‌లోని ఆర్ఆర్ అప్పారావు వీధిలో ఉన్న బ్యాంక్‌కు బుధవారం ఖాతాదారులు భారీగా తరలివచ్చారు. లక్షలాది రూపాయలు డిపాజిట్ చేసిన ఖాతాదారులు తమ డబ్బు భద్రంగా ఉంటుందో లేదోనని ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. 1929లో ప్రారంభించిన ఈ బ్యాంకు మరో నాలుగేళ్లలో వందేళ్లు పూర్తి చేసుకోనుంది. సుమారు పదేళ్ల క్రితం బ్యాంకు పాలకమండలి, అధికారులు వ్యవహరించిన తీరు, అడ్డగోలుగా ఇచ్చిన రుణాలను వసూలు చేయకపోవటం వల్లో నష్టాల్లోకి వెళ్లింది. సుమారు మూడేళ్ల క్రితం రూ.300 కోట్ల టర్నోవర్ కాలక్రమేణా తగ్గిపోయింది. బ్యాంకులో జరిగిన అవినీతి అక్రమాలపై అనేక కేసులు నమోదు కావడంతో పాటు ఆరోపణలు కూడా వచ్చాయి. రుణాలు సకాలంలో వసూలు చేయకపోవటంతో సుమారు వడ్డీ రూ.100 కోట్లకు చేరింది. దీంతో ఆర్బీఐ అధికారులు 2018 నుంచి బ్యాంకు లావాదేవీలను నిలిపివేశారు. కేవలం రికవరీలే వసూలు చేయాలని ఆదేశించారు. అయితే, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవటంతో వందేళ్లు పూర్తి చేసుకోవాల్సిన బ్యాంకు ఆకస్మికంగా లైసెన్స్‌ను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. గత పాలకవర్గం, అధికారుల తీరుతో ప్రస్తుతం డిపాజిట్‌దారులు ఆందోళన చెందుతున్నారు. లైసెన్స్ రద్దయ్యిందని తెలియటంతో బ్యాంకుకు క్యూ కట్టారు.

8లో

మడ అడవులపై కన్ను

బందరు మండలం కానూరులో ఐదెకరాల ఆక్రమణ



బందరు మండలం కానూరు గ్రామంలో నరికివేసిన మడచెట్లు

ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సముద్రతీరంలోని గ్రామాలకు రక్షణ గోడలా నిలబడే మడ అడవులపై బంటుమిల్లి మండలం మణిమేశ్వరానికి చెందిన ఓ వ్యక్తి కన్నుపడింది. బందరు మండలం కానూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని ఐదెకరాలను ఆక్రమించేశాడు. ఏపుగా ఎదిగిన మడచెట్లను వారం రోజులుగా యంత్రాలతో కోసివేయించి కూలీలతో గట్లు వేయిస్తున్నాడు. భవిష్యత్తులో 70 నుంచి 80 ఎకరాల వరకు ఆక్రమించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. ఇదేంటని ప్రశ్నించిన స్థానికులను నేను ఎమ్మెల్యే బంధువును అంటూ బెదిరింపులకు దిగుతున్నాడు. వీటిని అడ్డుకోవాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- యంత్రాలతో మడ అడవుల తొలగింపు
- భవిష్యత్తులో 70 నుంచి 80 ఎకరాల భూమి ఆక్రమణకు భారీ స్కెచ్
- ఎవరైనా ప్రశ్నిస్తే ఎమ్మెల్యే బంధువునంటూ ఆక్రమణదారుడి బెదిరింపులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బందరు మండలం కానూరు రెవెన్యూ గ్రామ పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. లజ్జబండ డ్రెయినేజీ పక్కనే ఉన్న ఈ భూమిలో మడ అడవులు ఉన్నాయి. బంటుమిల్లి మండలం మణిమేశ్వరానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల కాలంలో ఈ భూమిపై కన్నేశాడు. 70 నుంచి 80 ఎకరాల భూమిని ఆక్రమించేందుకు భారీ స్కెచ్ వేశాడు. తొలి విడతగా ఐదు ఎకరాల్లోని మడచెట్లను గత వారం రోజులుగా యంత్రాల ద్వారా కోయించి వేస్తున్నాడు. దట్టంగా పెరిగిన మడ అడవిని యథేచ్ఛగా నరికివేయిస్తున్నాడు. ఈ అంశంపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఇంతవరకు మడచెట్ల నరికివేతను ఆపేందుకు రెవెన్యూ అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు.

రొయ్యల చెరువులకు అనుకూలమని..

కానూరు-పెదపట్నం గ్రామాల మధ్యగా లజ్జబండ డ్రెయినేజీ ప్రవహించి కానూరు వద్ద సముద్రంలో కలుస్తుంది. కానూరు రెవెన్యూ గ్రామ పరిధిలో లజ్జబండ డ్రెయినేజీకి ఇరువైపులా ప్రభుత్వ భూముల్లో ఉన్న మడ అడవులలోకి సముద్రం నుంచి ఉప్పునీరు లజ్జబండ డ్రెయినేజీ ద్వారా సముద్రపు పోటు సమయంలో వచ్చి, ఆటు సమయంలో మళ్లీ సముద్రంలోకి వెళ్తోంది. రొయ్యల చెరువులకు సముద్రపు నీరు అందుబాటులో ఉంటే రొయ్యలసాగుకు ఢోకా ఉండదు. ఈ నేపథ్యంలోనే లజ్జబండ డ్రెయినేజీ పక్కనే ఉన్న మడఅడవులపై కన్నేసిన మణిమేశ్వరానికి చెందిన ఈ వ్యక్తి తాను ఎమ్మెల్యే దగ్గరి బంధువునని.. తానేం చేసినా చెల్లుబాటు అవుతుందని గత కొంతకాలంగా ప్రచారం చేసుకుంటూ వచ్చాడు. ఎమ్మెల్యేకు ఈ వ్యక్తి బంధువో కాదో తెలియదు గాని పైకి మాత్రం ఎమ్మెల్యే పేరు చెప్పి భూమి ఆక్రమణకు తెరతీశాడు. తొలి విడతగా మడచెట్లను నరికి కూలీల ద్వారా చిన్నపాటి చెరువులు గట్లువేసే ప్రయత్నాల్లో ఉన్నాడు. కొంతకాలం పాటు భూమిని తన ఆధీనంలో ఉంచుకుని, రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని రానున్న వేసవి కాలంలో రొయ్యల చెరువులుగా మార్పు చేస్తానని బాహాటంగానే ఈ వ్యక్తి చెబుతుండటం గమనార్హం.

భీమవరం వారికి లీజుకు ఇచ్చేందుకే..

కానూరు, పెదపట్నం గ్రామాల్లోని మడ అడవులను ఐదు, పది ఎకరాల చొప్పున రొయ్యల చెరువులుగా మార్పు చేసిన అనంతరం ఈ భూములు తమకు చెందినవేనని భ్రమను ఆక్రమణదారులు కల్పిస్తారు. కొంతకాలం తర్వాత ప్రభుత్వ భూములను భీమవరానికి చెందిన బడాబాబులకు లీజుకు ఇస్తారు. ఏడాదికి ఎకరానికి రూ.70 వేల నుంచి 80 వేల చొప్పున లీజుకు ఇచ్చే ఆనవాయితీ గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో కొనసాగుతోంది. ఇదే ఆనవాయితీని మణిమేశ్వరానికి చెందిన వ్యక్తి అమలు చేయడానికి పూనుకోవడం విమర్శలకు దారితీస్తోంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కానూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని మడ అడవులను పరిశీలించి మడ చెట్లను నరికేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములు ఎవరు ఆక్రమించినా సహించేదిలేదు.

\- మధుసూదనరావు, తహసీల్దార్ మచిలీపట్నం

జల్‌జీవన్ మిషన్ వేగవంతం 6లో

కార్తీక సముద్ర స్నానాలకు ఏర్పాట్లు 6లో

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ 6లో

ఆర్గానిక్ బెల్లంతో ఆరోగ్యం పదిలం

ఇసుక తవ్వకాలు ప్రారంభం

రీచ్‌ల నుంచి తొలగిపోయిన వరద నీరు



- తవ్వకాలకు 15 రీచ్‌ల గుర్తింపు
- ఎనిమిది రీచ్‌ల్లో కొనసాగుతున్న తవ్వకాలు
- అనుమంచిపల్లిలో అందుబాటులో ఇసుక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇసుక కొరత సమస్య తీరనుంది. జిల్లాలో గుర్తించిన రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభమయ్యాయి. వరద నీరు తగ్గిపోయిన రీచ్‌ల్లో తవ్వకాలు సాగుతున్నాయి. జిల్లాలో మొత్తం 15 రీచ్‌లు ఉండగా, వాటిలో ఎనిమిది రీచ్‌లలో తవ్వకాలు మొదలుపెట్టారు. వాస్తవానికి కిందటి నెలలోనే తవ్వకాలు జరపాలని భూగర్భ గనుల శాఖ అధికారులు భావించారు. ఇసుకను తవ్వి, వాహనాల్లో పోసి, అక్కడి నుంచి స్టాక్ యార్డులకు తరలించి, అన్‌లోడ్ చేసే పనులను కాంట్రాక్టుకు ఇచ్చారు. కార్మికులతో ఇసుకను తవ్వించడానికి ప్రణాళిక సిద్ధం చేసిన క్రమంలో ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద రావడం మొదలైంది. ఈ రీచ్‌ల్లోకి నీరు చేరడంతో తవ్వకాలు ఆగిపోయాయి. ఇప్పుడు వరద తగ్గడంతో తిరిగి తవ్వకాలు ప్రారంభమయ్యాయి.

ఇదీ పరిస్థితి

జిల్లాలో ప్రస్తుతం ఒక స్టాక్ పాయింట్‌లోనే ఇసుక నిల్వ ఉంది. కీసర, మొగలూరు, అనుమంచిపల్లిలో స్టాక్ పాయింట్లు ఉన్నాయి. వాటిలో అనుమంచిపల్లి స్టాక్ పాయింట్‌లో ప్రస్తుతం 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. ఇక్కడి నుంచే ఇసుకను విక్రయిస్తున్నారు. జిల్లాలో మొత్తం 15 రీచ్‌లు ఉండగా, ప్రస్తుతం ఎనిమిదింటిలో తవ్వకాలకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. పెనుగంచిప్రోలు మండలంలోని శనగపాడు, రంగనాయకపాలెం, పెనుగంచిప్రోలు 1, 2 రీచ్‌లు, కంచికచర్ల మండలంలోని పెండ్యాల 1, 2 రీచ్‌ల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. కంచికచర్ల మండలంలో కొనరబాద, ఇందుపల్లిలో ఇసుకను తవ్వుతున్నారు.

వరద కారణంగానే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్మాణరంగం ఊపందుకుంది. దీంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించిన కొద్దినెలలకు కృష్ణానదికి భారీస్థాయిలో వరదలు వచ్చాయి. ఫలితంగా ఇసుక అందుబాటులోకి రాలేదు. స్టాక్ పాయింట్లలో ఇసుక తగ్గిపోయింది. వాస్తవానికి గతనెల 16 నుంచి రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభం కావాల్సి ఉంది. ఈ పనులకు ఎగువ నుంచి వస్తున్న వరద అడ్డుగా మారింది. ప్రస్తుతం బ్యారేజీకి ఎగువ నుంచి 5 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. ఈ నీరు పులిచింతల, వజినేపల్లి, కీసర నుంచి వస్తోంది. ఈ నీటి వల్ల రీచ్‌లకు వచ్చిన ఇబ్బందేమీ లేదని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. రీచ్‌ల్లో నిలిచిపోయేంత స్థాయిలో వరద రావడం లేదని పేర్కొంటున్నారు. పులిచింతలలోని జలవిద్యుత్ కేంద్రం నుంచి ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం ఎనిమిది రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నందున, మిగిలిన రీచ్‌ల్లోనూ తవ్వకాలు ప్రారంభమైతే.. చాలావరకు కొరత తీరుతుందని భూగర్భ గనుల శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లా ఏఎస్పీగా వీవీ నాయుడు

మచిలీపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా ఏఎస్పీ (అడ్మిన్)గా వీవీ నాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతకొన్ని రోజులుగా ఈ పోస్టు ఖాళీగా ఉంటోంది. ఈ నేపథ్యంలో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న వీవీ నాయుడు ఏఎస్పీగా నియమితులయ్యారు.

పట్టిసీమ నుంచి నీటి విడుదల

14 పంపులను ఆన్‌చేసిన అధికారులు

విజయవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ నుంచి కృష్ణానదికి గోదావరి నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 14 పంపులను అక్కడి అధికారులు ఆన్ చేశారు. వాటిద్వారా సుమారు 4 వేల క్యూసెక్కుల నీరు కృష్ణాకు చేరుతోంది. గోదావరికి ప్రస్తుతం 20 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో పట్టిసీమ పంపులను ఆన్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టిసీమ నుంచి నీటిని వదలడం ఇది రెండోసారి.



మంగినపూడి బీచ్‌లో రెండు పడవలపై ప్రయాణం చేస్తున్న మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్, కలెక్టర్ బాలాజీ

రెండు పడవలపై చేపలవేట!

- మంగినపూడిలో అధికారుల వినూత్న ప్రయోగం

6లో



గ్రహణం వీడిన వేదాద్రి ఎత్తిపోతల!

- టీడీపీ హయాంలో రూ.489 కోట్లతో ప్రతిపాదనలు
- వైసీపీ ప్రభుత్వంలో రివర్స్ టెండరింగ్.. నిలిచిన పనులు
- కూటమి ప్రభుత్వం రాకతో తిరిగి ప్రారంభం

6లో

వైభవంగా పాండురంగని రథోత్సవం

» ఆకట్టుకున్న కళాకారుల విన్యాసాలు » అడుగడుగునా స్వామివారికి భక్తుల మంగళహారతులు


పాండురంగని రథం నడుపుతున్న మంత్రి కొల్లు రవీంద్ర


రథోత్సవంలో కళాకారుల కోలాట ప్రదర్శన



మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాండురంగ స్వామి రథోత్సవం బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మచిలీపట్నం పురవీధుల్లో అంగరంగ వైభవంగా సాగింది. మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, కూటమి నేతలు ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ మూర్తులను ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. ట్రాక్టర్‌ను మంత్రి కొల్లు రవీంద్ర నడిపారు. ఊరేగింపులో పాండురంగ స్వామికి నారికేళాలు, మధుర ఫలాలు సమర్పించారు. భక్తులకు ఎన్ఆర్ఐ సతీష్ 500 కిలోల లడ్డూలు పంచారు. చిలకలపూడి పాండురంగ స్వామి దేవాలయం వద్ద ఉదయం 9 గంటలకు ప్రారంభమైన రథం పరాసుపేట, నాయర్‌బడ్డీ, కోనేరుసెంటర్, రేవతీ, లక్ష్మీటాకీసు, జిల్లాపరిషత్ సెంటర్‌ల మీదుగా చిలకలపూడి పాండురంగ స్వామి గుడి వద్దకు రథం చేరుకుంది. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధి సమ్మెట శ్రీహరి నాయర్‌బడ్డీ సెంటర్‌లో భక్తులకు స్వీట్లు, తేనీరు అందజేశారు. కోనేరుసెంటర్‌లో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. డీఎస్పీ అబ్దుల్ సుభాన్, చిలకలపూడి సీఐ నబీ, ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు, ఆర్‌పేట సీఐ ఏసుబాబులు బందోబస్తును పర్యవేక్షించారు.

కళాకారుల విన్యాసాలు

పాండురంగ స్వామి రథం ముందుకు సాగగా వివిధ జిల్లాలకు చెందిన కళాకారులు తమ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. పాండురంగ స్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. స్వర్ణపతకాలు సాధించిన మాధవి బృందం 700 భగవద్గీత శ్లోకాలు, సంపూర్ణ భగవద్గీత పారాయణ చేశారు.

అసెంబ్లీ వేదికగా

చింతలపూడిపై

వసంత తొలి ప్రశ్న



ఇబ్రహీంపట్నం/నందిగామ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిని పూర్తిచేసి గోదావరి జలాలను ఎన్ఎస్‌పీ కాలువల్లో పారించాలని మూడోజోన్‌లోని ఆయకట్టు భూములకు సమృద్ధిగా సాగునీరు అందించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కోరారు. బుధవారం జరిగిన ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో తొలి ప్రశ్నగా ఆయన చింతలపూడి ఎత్తిపోతల పథకంపై అడిగారు. టీడీపీ హయాంలో 2014-19 వరకు సుమారు రూ.4,200 కోట్లు ఖర్చు చేసి చింతలపూడిని పరుగులు పెట్టిస్తే వైసీపీ ప్రభుత్వం రైతు ప్రయోజనాలను గాలికొదిలేసి ప్రాజెక్టును పక్కన పెట్టిందన్నారు. పథకం పూర్తి అయితే ఎన్టీఆర్ జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లోని 35 మండలాలకు కొత్తగా 2 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని సభ ముందు ఉంచారు. చింతలపూడి ఆలస్యానికి గత వైసీపీ ప్రభుత్వమే కారణమని ప్రాజక్టు విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి త్వరలో చింతలపూడి పూర్తికి కృషిచేస్తామని మంత్రి నిమ్మల సమాధానం ఇచ్చారు.

ప్రజాహితం కోసం పనిచేస్తా.. సౌమ్య



ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి ప్రజాహితం కోసం పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తానని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. శాసనసభలో ఆమె మాట్లాడుతూ, మహిళా పోలీసులకు ఆరుశాఖల విధులు అప్పగించి వైసీపీ ప్రభుత్వం వారికి సరైన జాబ్ క్యాలెండర్ లేకుండా చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వారికి స్పష్టమైన జాబ్‌చార్ట్ కేటాయించాలని, కేవలం మహిళా విభాగం బాధ్యతలు మాత్రమే అందించాలని కోరారు.

పేదలకు శాశ్వత ఇళ్లు.. : బోడె ప్రసాద్



పేదలకు శాశ్వత ప్రాతిపదికన ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వాటిపై పూర్తి హక్కులు లబ్ధిదారులకు కల్పించాలని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కోరారు. ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా తమకు కేటాయించిన స్థలాలపై పూర్తి హక్కులు తమకు లేవని, బ్యాంకులు లోన్లు ఇవ్వడం లేదని పలువురు లబ్ధిదారులు తెలిపారని, వారికి ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో హక్కులు కల్పించాలని కోరారు.

పీఏసీఎస్ సీఈవోపై వేటు

నందిగామరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోళ్లమూడి పీఏసీఎస్ సీఈఓ(కార్యదర్శి) కటారపు రామారావుపై ఉన్నతాధికారులు వేటువేశారు. సహకార సంఘంలో ఉద్యోగం చేస్తూ డప్పు కళాకారుల పెన్షన్ తీసుకోవడంపై గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపిన అధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీసీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఏపీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ 2024, ఎస్టీటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి జి.రమేష్ తెలిపారు. అభ్యర్థులు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వంద మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ సమయంలో స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తారన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు టెన్త్, డీఈఈడీ, టీటీసీ, టెట్ మార్కుల లిస్టు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్టు సైజు ఫోటోలు మచిలీపట్నం ఈడేపల్లిలోని పద్మావతి మహిళా బిఈడీ కళాశాలలో అందజేయాలన్నారు. వివరాలకు 9849420123కు సంప్రదించాలన్నారు.

జల్‌జీవన్ మిషన్ వేగవంతం

» అధికారులకు కృష్ణా కలెక్టర్ బాలాజీ ఆదేశం

మచిలీపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జల్‌జీవన్, ఉపాధిహామీ పథకం పనులను వేగవంతం చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అధికారులను ప్రశ్నించారు. కలెక్టరేట్‌లో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా, ఇంజనీరింగ్ అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీటిని అందించే జల్‌జీవన్ మిషన్ పథకం పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ కాలనీల్లో రహదారుల పనులకు బిల్లులు చెల్లించాలన్నారు. కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేయవద్దని, ఈ ఆర్థికసంవత్సరం ముగిసేలోపు పనులు పూర్తిచేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్‌కాలనీల్లో రహదారులను ఉపాధి పథకం ద్వారా మెరకచేసేందుకు అవకాశం లేదని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నేరుగా కాకుండా, పంచాయతీ పాలకవర్గాల ద్వారా ఉపాధి నిధులతో రహదారులను మెరక చేసేందుకు తీర్మానాలు చేయించి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ రాజ్ ఎస్ఈ రమణారావు, డ్వామా పీడీ శివప్రసాద్, ఆర్అండ్‌బీ ఈఈ లోకేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నటరాజ్, అధికారులు పాల్గొన్నారు.


మంగినపూడి బీచ్‌లో ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

కార్తీక స్నానాలకు ఏర్పాట్లు

» కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధర్‌రావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్తీకపౌర్ణమి సందర్భంగా మంగినపూడి సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావులు బీచ్‌ను సందర్శించారు. శుక్రవారం తెల్లవారుజామునుంచే మంగినపూడికి సుమారు లక్షన్నర మంది యాత్రికులు బీచ్‌ను సందర్శించే అవకాశం ఉన్నందున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసేందుకు జిల్లా అధికారులకు కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. పోలీసు ఔట్‌పోస్టు, గజ ఈతగాళ్లను, బోట్లను ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ క్యాంపులు, తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు స్థలం, ట్రాఫిక్ నియంత్రించేందుకు ఒన్‌వే చేయాలన్నారు. మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపాలన్నారు. కార్యక్రమంలో డీపీవో అరుణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి గీతాబాయి, ఆర్డీవో స్వాతి, ఆర్‌అండ్‌బి ఈఈ లోకేశ్వరరావు, ఆర్టీసీ డీఎం పెద్దిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, లంకే హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ బాలాజీ బోటుపై కొంచెం సేపు ప్రయాణం చేసి ఒడ్డున ఎంత మంది భక్తులు సముద్రం వద్దకు వచ్చి స్నానం చేసేందుకు వీలు ఉంటుందో పరిశీలించారు.


మంగినపూడిబీచ్‌లో రెండు పడవల ప్రయాణంపై పరిశీలన

రెండు పడవలపై చేపల వేట!

» మంగినపూడిలో అధికారుల వినూత్న ప్రయోగం

మచిలీపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో చేపలవేటకు బోట్లు వేళ్లే సమయంలో అలల తాకిడికి తరచూ ప్రమాదాలకు గురవుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో రెండు పడవలను కట్టెలతోకట్టి సముద్రంలోకి వెళితే ప్రమాదాలు ఎంతమేర నివారించవచ్చనే అంశంపై బుధవారం మంగినపూడిలో ప్రయోగాత్మకంగా అధికారులు పరిశీలించారు. కట్టెలతో కట్టిన రెండుబోట్లలో సముద్రంలో మత్స్యశాఖ కమిషనర్ టి.డోలాశంకర్, కలెక్టర్ బాలాజీ కొంతదూరం ప్రయాణించారు. ఈ ప్రయోగం సఫలమైతే ఆయిల్ ఖర్చులను తగ్గించడంతో పాటు, ప్రమాదాలను ఎంతమేర నివారించవచ్చనే అంశంపై మత్స్యకారులను అడిగి తెలుసుకున్నారు.

బాలికపై అత్యాచారం.. పోక్సో కేసు నమోదు

గన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాదలో బాలికపై పలుమార్లు యువకుడు అఘాయిత్యానికి పాల్పడటంతో ఆమె గర్భం దాల్చింది. నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పులవర్తి ప్రశాంత్ అదే గ్రామానికి చెందిన బాలిక(16)పై అత్యాచారం చేశాడు. బాలిక కడుపులో నొప్పి అంటూ ఇంట్లో చెప్పడంతో ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. వైద్యులు పరీక్షించి గర్భం అని తెలిపారు. బాలికను తల్లిదండ్రులు గట్టిగా ప్రశ్నించటంతో ప్రశాంత్ కారణమని చెప్పింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా వికాసానికి పెద్దపీట: రవినాయుడు

అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఎక్కడా లేనివిధంగా క్రీడాకారులకు ఉద్యోగాల్లో 3శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం చంద్రబాబు.. క్రీడారంగ అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.100కోట్లు కేటాయించారని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు చెప్పారు. క్రీడా వికాసానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో క్రీడాకారులు బాగా రాణించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో యువత రాణించేందుకు సీఎం చంద్రబాబు, విద్యామంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు.

గ్రహణం వీడిన వేదాద్రి ఎత్తిపోతల!

» టీడీపీ హయాంలో రూ.489 కోట్లతో ప్రతిపాదనలు

» వైసీపీ ప్రభుత్వంలో రివర్స్ టెండరింగ్

» పనులు నిలిపేసిన నాటి కాంట్రాక్టర్

» కూటమి ప్రభుత్వం రాకతో తిరిగి ప్రారంభం

» పాత పేరును కొనసాగించాలంటున్న రైతులు

(జగ్గయ్యపేట రూరల్, ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం రాకతో వేదాద్రి ఎత్తిపోతల పథకానికి గ్రహణం వీడింది. అయితే బిల్లుల చెల్లింపులు జరగటం లేదని మూడేళ్ల క్రితం పనులు వదిలి పలాయనం చిత్తగించిన కాంట్రాక్టర్ తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుట్టుచప్పుడు కాకుండా పనులు చేపట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది. 2019 ఫిబ్రవరిలో టీడీపీ ప్రభుత్వంలో రూ.489.28 కోట్ల ప్రతిపాదనతో 38,627 ఎకరాల ఆయకట్టు సాగులో కృష్ణానదిపై ముక్త్యాల ఎత్తిపోతల పేరుతో శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్నికల్లో ప్రభుత్వం మారటం, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన


ప్రస్తుతం ఇంటెక్‌వెల్


కాంట్రాక్టర్ పనులు వదిలి వెళ్లిన సమయంలో ఇంటెక్ వెల్


ఎక్స్‌కవేటర్ నిర్మాణ పనులు

జగన్‌మోహన్‌రెడ్డి రివర్స్ టెండరింగ్ పేరుతో అదే ప్రాజెక్టును రూ. 100 కోట్ల తక్కువతో నిర్మిస్తున్నామని ఆగస్టు 28, 2021లో వైఎస్సార్ వేదాద్రి ఎత్తిపోతల పేరుతో పథకానికి రూ.368 కోట్లతో శంకుస్థాపన చేశారు. రూ. 100 కోట్లు మిగిల్చామని నాడు జరిగిన సమావేశాల్లో వైసీపీ నేతలు ఊదరగొట్టినా ఆరోజు ఏర్పాటు చేసిన శిలాఫలకంపై మాత్రం టీడీపీ హయాంలో ప్రతిపాదించిన అంచనా వ్యయం అని ఉండటం గమనార్హం. రివర్స్ టెండరింగ్‌తో తగ్గించామని రూ.100 కోట్లపై నోరు మెదపకుండా బిల్లులు చెల్లించకపోవటంతో కాంట్రాక్టర్ పనులు వదిలి వెళ్లిన సంగతి విదితమే.

అనుమానాలెన్నో

టీడీపీ హయాంలో ముక్త్యాల పథకంతో జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లోని 28 గ్రామాలలో 38,267 ఎకరాల ఆయకట్టు సాగుతో పాటు ఆయా మండలాల పరిధిలోని చెరువులు, తాగునీటి సమస్య కూడా పరిష్కారమవుతాయని ప్రతిపాదనల్లో తెలిపారు. తాజాగా వేదాద్రి వద్ద పథకం ఏర్పాటు చేస్తే ప్రధానంగా జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లోని కొంత భాగానికి నీటి సరఫరా ఉంటుందని రైతులు అంటున్నారు. 28 గ్రామాలకు లబ్ధి చేకూరేలా ప్రతిపాదించిన


కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు

పథకం వేదాద్రిలో నిర్మిస్తే గ్రామాల పరిస్థితి అగమ్య గోచరమవుతుందని అంటున్నారు. మెట్ట ప్రాంతాల్లో సాగర్ జలాలపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు రాష్ట్ర విభజనతో తెలంగాణా నుంచి సరఫరాలో అంతరాయంతో ఇబ్బందులు పడుతున్నారు.

- వేదాద్రి వద్ద నాలుగేళ్ల క్రితం నిర్మించిన ఇంటెక్ వెల్ బావిలో ఏళ్ల తరబడి నీరు నిల్వ ఉన్నందున ఇనుము తుప్పు పట్టి ఉంటుందని, దానిపైనే ఎత్తిపోతల పథకం నిర్మిస్తే భవిష్యత్తులో కృష్ణానదికి వరదలు వస్తే ఆ ఇంటెక్ వెల్ తట్టుకుంటుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిర్మాణ సంస్థ మాత్రం నిల్వ నీటిని బయటకు తోడి ఇంజనీరింగ్ నిపుణుల పరిశీలన అనంతరం పనులు ప్రారంభిస్తామంటున్నారు. ప్రాజెక్టు కోసం జంగిల్ క్లియరెన్స్‌తో పాటు షెడ్డులను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులకు లేని సమాచారం

రూ.కోట్లతో వేలాది ఎకరాల సాగుకు పునర్నిర్మాణం చేపడుతున్న ప్రాజెక్టు విషయంలో కాంట్రాక్టు సంస్థకు సంబంధించి సర్పంచ్, ప్రజాప్రతినిధులకు సమాచారం లేకపోవడం కొస మెరుపు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో తిరిగి పనులు ప్రారంభించి పథకానికి గతంలో పెట్టిన పేరుతో సాగిస్తారా లేక మారుస్తారా అని రైతులు తర్జనభర్జన పడుతున్నారు. జగన్ హయాంలో పెట్టిన పేరు మార్చాలని రైతులు కోరుతున్నారు.

కాలేజీ పాస్‌లకు ప్రత్యేకం!

» జగ్గయ్యపేట డిపో వింత పోకడ

» బడి బస్సు రూటు మార్చిన అధికారులు

జగ్గయ్యపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కాలేజీ పాస్‌లు ఉన్న వారికే ఈ బస్సు 'ప్రత్యేకం'.. అంటూ జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో అధికారుల వింత స్లోగన్ 'ప్రగతి చక్రాల'కు ప్రతిబంధకంగా మారింది.. బస్సుకు ఉన్న బోర్డు తొలగించి కాలేజీ పాస్‌లు ఉన్న వారికే.. అంటూ కాగితంపై రాసి అంటించటం అటు ఆర్టీసీ వర్గాల్లోను, ఇటు ప్రయాణికుల్లోను చర్చకు దారి తీసింది.

సాధారణంగా బడి బస్సులు పల్లెల నుంచి పట్టణాలకు, సమీపంలో పెద్ద గ్రామాల్లో ఉన్న హైస్కూళ్లకు వచ్చే పిల్లల కోసమే అయినా సాధారణ ప్రజలు ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. బడిబస్సు ఎక్కే ప్రయాణికులకు కండక్టర్ టికెట్లు కొట్టి చార్జీలు వసూలు చేస్తాడు. ఇటీవల డిపోలో కార్మికులకు, అధికారులకు మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. దీనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇదిలా ఉంటే ఆర్టీసీ కొత్త వివాదం వెలుగులోకి వచ్చింది. టిమ్స్ ఆపరేషన్ వచ్చిన డ్రైవర్లను కాకుండా ఇతర డ్రైవర్లను బడిబస్సులకు పంపు తున్నారు. టికెట్లు కొట్టడం రాదని మొత్తుకున్నా డ్యూటీలు వేస్తుండటంతో వాళ్లు టిమ్స్ మిషన్లను పక్కనపెట్టేసి పాస్‌లు ఉన్న వారినే ఎక్కిస్తున్నారు. డ్యూటీ డ్రైవర్లు ఏకంగా కాగితంపై రాసి బడి బస్సు బోర్డుకే కాలేజి పాస్‌లు ఉన్న వారికే ఈ బస్సు అని అంటించేశారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో గందరగోళానికి దారితీసింది. గ్రామీణ ప్రాంతాల్లో అంతంత మాత్రం ఆక్యుపెన్సీతో ఉన్న డిపో ఈ విధానంతో పూర్తిగా అటకెక్కినట్టేనని కార్మిక నేతలు అంటున్నారు. దీనిపై ఆర్టీసీ డిపో రఘురాంను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తనకు ఈ విషయం తెలియదని, సంబంధిత అధికారులను విచారించి చర్యలు తీసుకుంటానని చెప్పారు.


ఆర్టీసీ బస్సుఅద్దం వెనుక రాసిన బోర్డు

ఆర్గానిక్ బెల్లం.. ఆరోగ్యం పదిలం

» సేంద్రీయ వ్యవసాయం వైపు యువ రైతు అడుగులు

(మోపిదేవి-ఆంధ్రజ్యోతి)

ఉన్నత విద్య అభ్యసించి యువత కంప్యూటర్ రంగంవైపు పరుగులు పెడుతుంటే.. బొబ్బర్లంక గ్రామానికి చెందిన బాలతేజ మాత్రం ఆరోగ్యవంతమైన సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నాడు. బొబ్బర్లంక గ్రామానికి చెందిన బాలతేజ ఐదెకరాల చెరకు పంటను సేంద్రీయ విధానంలో సాగుచేసి పూర్తి ఆర్గానిక్ పద్ధతిలో బెల్లం తయారు చేస్తున్నాడు. కొక్కిలిగడ్డ గ్రామంలో యంత్రాలను ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సలహాలు పాటిస్తూ.. రసాయనాలు, మందులు వినియోగించకుండా సేంద్రీయ పద్ధతిలో వేప పిండి, జీవామృతం, యజ్ఞాస్త్రంతో చెరకు పంట సాగుచేశాడు. పంట దిగుబడి రావటంతో ఆర్గానిక్ విధానంలో బెల్లం తయారు చేస్తున్నాడు. ప్రస్తుతం 1000 కేజీల బెల్లాన్ని తయారు చేసినట్టు బాలతేజ చెప్పాడు. మార్కెటింగ్ సౌకర్యం సమకూరిస్తే మరింత ఉత్పత్తికి అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. టన్ను చెరకుతో 95 కేజీల బెల్లం తయారు చేయవచ్చని రైతులు చెబుతున్నారు.


గానుగ బెల్లం పాకం తయారు చేస్తున్న కూలీలు


ఆర్గానిక్ పద్ధతిలో తయారు చేసిన బెల్లం

యూనిట్ ఉద్యోగుల ప్రోత్సాహం

- బాలతేజ, రైతు



ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఉద్యోగులు నరసింహారావు, సురేష్‌ల సూచనలతో రెండేళ్లుగా ఆర్గానిక్ పద్ధతిలో చెరకు సాగుచేసి బెల్లం తయారు చేస్తున్నా. చెరకు సాగు, బెల్లం తయారీకి కూలీలు, పెట్టుబడి రూపంలో అధిక మొత్తంలో ఖర్చు అవుతుంది. ఇప్పటికి 1000 కేజీల బెల్లం తయారు చేయటం జరిగింది. ప్రభుత్వం ఆర్గానిక్ ఉత్పత్తులకు రాయితీలు కల్పించి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం

- పి.నరసింహారావు, ఏపీ సీఎన్ఎఫ్ మండల యూనిట్ ఇన్‌చార్జి



ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడినవారవుతారు. బొబ్బర్లంక గ్రామానికి చెందిన యువరైతు తేజ తన వ్యవసాయ భూమిలో తయారు చేస్తున్న ఆర్గానిక్ బెల్లాన్ని ఈ ప్రాంత వాసులు వినియోగించేలా అవగాహన కల్పిస్తాం. మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115,124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

ధర్నాను విజయవంతం చేయాలి : సీపీఎం



పెనమలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో నేడు తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కార్మికనగర్ కట్టపై బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప్పాడ త్రిమూర్తులు, మస్తాన్‌వలి, పీ లక్ష్మీనారాయణ, వీ సోమశేఖర్, పాతాళలక్ష్మి, దుర్గారావు, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

నేడు కోలవెన్నులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కంకిపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలవెన్నులో గురువారం ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ భవన్నారాయణ తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని వివిధ గ్రామాల్లో మొత్తం 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్ఐ ఉస్మాన్ పాల్గొన్నారు.



గండిగుంటలో క్షీరాబ్ది ద్వాదశి గ్రామోత్సవంలో దండమూడి చౌదరి

క్షీరాబ్ధి ద్వాదశి పూజలు

ఉయ్యూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాస క్షీరాబ్ధి ద్వాదశి పురస్కరించుకుని గండిగుంట రామాలయంలో బుధవారం లక్ష తులసి పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించి భక్తులనుంచి తులసి, ఇతర పూజా సామాగ్రి స్వీకరించారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

సాలగ్రామ పూజలు

హనుమాన్‌జంక్షన్ : స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సాలగ్రామ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ట్రస్టీ కాకాని బాబు, తవ్వా పూర్ణచంద్రరావు, ఈవో శ్రీనివాస్ తదితరులు పర్యవేక్షించారు.



సభ్యత్వం అందజేస్తున్న ఎస్టీయూ నేతలు

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

గన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులను కూటమి ప్రభుత్వం విస్మరిస్తుందని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ అన్నారు. మండలం లోని పలు పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలన్నారు. ప్రభుత్వం పే రివిజన్ కమిషన్ అమలు చేసే లోపుగా మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమ్ము ప్రసాద్, బొకినాల శ్రీధర్, ఎం.ఆనంద్ కుమార్, ఆర్.ఆనంద్‌కుమార్, పల్లె రవికుమార్, అబ్దుల్ బషీర్, సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉంగుటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏరియాలోని లంకపల్లి ఫీడర్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈ నెల 14వ తేదీ గురువారం ఉదయం 8 నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు విద్యుత్‌శాఖ గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుపల్లి గ్రామ శివారు జంధ్యాలవారి కండ్రిక, ముక్కపాడు గ్రామాల్లో నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే బోడె ప్రసాద్
- యనమలకుదురులో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. తాడిగడప మునిసిపాలిటీలో యనమలకుదురు నాల్గవ సచివాలయ పరిధిలోని రెండో ఇందిరానగర్ కట్టపై జన్మభూమి వంతెన నుంచి కొసరాజు కృష్ణారావు ఇంటివరకు 410 మీటర్ల పొడవైన రోడ్డు నిర్మాణానికి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. నలభై లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ రోడ్డు పనులు త్వరలోనే పూర్తవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కమిషనరు భవానీ ప్రసాద్, కూటమి నాయకులు ముప్పారాజా, తాతపూడి గణేష్, అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి బాబురావు, అనంతనేని ఆజాద్, భరద్వాజ్, అంగిరేకుల మురళి, పొదాల ప్రభాకర్, వీరాస్వామి, బలగం నాగరాజు, రఫీ, మల్లంపాటి విజయలక్ష్మి, పండల రజిని, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు సముచితస్థానం



గురుమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు సలీం, శివయ్య

కంకిపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం ఉంటుందని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, కంకిపాడు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కొండవీటి శివయ్య అన్నారు. గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన వీరంకి వెంకట గురుమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగిందని తెలియజేశారు. మహిళలకు ఆస్తి హక్కులో సమాన వాటా కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచాలి



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న మారుబోయిన కోటేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. మానవత జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గుడివాడ రోడ్డులోని జ్యోతి హైస్కూల్ విద్యార్థినులకు నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు మారుబోయిన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు జయరామచంద్రరావు, కొట్నేని రామచంద్రరావు, ఘంటా సత్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

డీఈవో రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రామారావు, డీవైఈవో పద్మారాణి,

ఉయ్యూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో మొదటి మూడుస్థానాల్లో ఒకరుగా నిలిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖా అధికారి పీవీజే రామారావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉయ్యూరు రెవెన్యూ డివిజన్‌లో ఉయ్యూరు, పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, పామర్రు, మొవ్వ మండ లాల్లో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో విద్యా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ పటిష్ఠ పరీక్షా ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. గత సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో 90.5 శాతంగా ఉన్న ఫలితాలు ఈ విద్యసంవత్సరంలో నూరుశాతం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. డీవైఈవో పద్మారాణి, ఏఈవో- 2 సుధారాణి, హెచ్ఎం జ్యోత్స్నదేవి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు రమణకు సత్కారం

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం అందుకున్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జీవీ రమణను జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు ఘనంగా సత్కరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ డివిజన్ ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశానికి హాజరైన ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం అందుకున్న రమణను ఘనంగా సత్కరించి అభినందించారు.



ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును అభినందిస్తున్న జంక్షన్ టీడీపీ నాయకులు

ఎమ్మెల్యే యార్లగడ్డకు అభినందనల వెల్లువ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విప్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు టీడీపీ బాపులపాడు మండల నేతలు శుభా కాంక్షలు తెలియజేశారు. బుధవారం విజయవాడలో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఎమ్మెల్యేకు శాసన సభలో సముచితస్థానం కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు, బాపులపాడు ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, నాయకులు మొవ్వా వేణు గోపాల్, మిక్కిలినేని మురళీ, తుమ్మల బ్రహ్మాజీ, గూడవల్లి చిన్నా, వీరమాచనేని నాగయ్య ఉన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న 104 ఉద్యోగులు

గన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర పరిస్థితుల్లో సేవ లందిస్తున్న తమను నిర్లక్ష్యం చేయటం సరికాదని, 104 ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కోశాధికారి బి.సుబ్బారావు అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం వినతిపత్రం ఉంచి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ, ప్రతి నెల క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలన్నారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జీవో నెంబర్ 7ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ సొమ్మును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. డీఈవో ఉమా పాల్గొన్నారు.

ద్వాక్రా సంఘాల్లో నిరక్షరాస్యులకు శిక్షణ

పెనమలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు మండల మహిళా సమాఖ్యలో డ్వాక్రా సంఘాల సభ్యుల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారికి ప్రాథమిక విద్య, డిజిటల్ విద్య, ఆర్థిక విద్యలపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రణవి మాట్లాడుతూ, మండలంలో 350మంది డ్వాక్రా మహిళలు నిరక్షరాస్యులని, వారిని గుర్తించి 35 మంది వాలంటీర్లతో శిక్షణ ఇచ్చామన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని గ్రంథాలయాల్లో గురువారం నుంచి 57వ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రంథాలయాల అధికారులు తెలిపారు. ఈ వారోత్సవాల్లో అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హనుమాన్‌జంక్షన్ : వీరవల్లి శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ గ్రంథాలయాధికారిణి పాతూరి స్వర్ణలతాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, డిబేట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉయ్యూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి బుధవారం వరకు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, దేశభక్తి గేయాలు, విచిత్రవేషాదారణ, రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికార బి.రమణి తెలిపారు.

కేటుగాళ్ల మాయలో పడి మోసపోవద్దు

ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు

ఉయ్యూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చెడువ్యక్తుల మాయ మాటల్లో పడి మోసపోయి జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకోవద్దని ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు విద్యార్థినులకు సూచించారు. నేటి సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న నేరాలు, యువతపై సినిమాలు, సోషల్ మీడియా ప్రభావం, వీటిపట్ల అప్రమత్తతపై ఏజీ అండ్ ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థినులతో బుధవారం ముఖాముఖి, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సినిమాలు, సోషల్ మీడియా మాయలోపడి అనేకమంది యువకులు తప్పుడు ఉద్దేశాలతో ఆడపిల్లలను ట్రాప్ చేయాలని రోడ్లపైన కళా శాల లోపల ప్రయత్నిస్తూ ఉంటారని అటువంటి వారిపట్ల అప్రమత్తతో వ్యవహరించి దూరంగా ఉండాలన్నారు. రానున్న రోజుల్లో భార్యభర్తలు ఇద్దరూ ఏదోఒక వ్యాపారం, ఉద్యోగం చేసుకుని కుటుంబాన్ని పోషించుకోవాలసిన పరి స్థితులు ఉంటాయన్నారు. చెడు ఆకర్షణలో పడకుండా జీవితంలో మంచి లక్ష్యాలు పెట్టుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. శక్తిటీమ్ అనే మహిళా రక్షక దళా న్ని జిల్లా ఎస్పీ గంగాధర్ ఏర్పాటు చేశారని, ఈ టీములు ప్రతి రోజూ కళాశాలలు, బస్‌స్టాప్‌ల వ ద్ద, రద్దీగా ఉండే ప్రదేశాల్లో పెట్రోలింగ్ చేస్తూ ఉంటాయని ఈ వ్ టీజింగ్, మహిళలను వేధింపులకు గురిచేసే వాళ్ల ఆట కట్టిస్తాయన్నారు. ఎటువంటి ఇబ్బంది కలిగినా శక్తిటీమ్‌కు తెలియచేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ పాల్గొని పలు సూచనలు చేశారు.



మోసాల పట్ల విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామారావు

తిరుపతమ్మ ఆలయంలో సేవా సదనం ప్రారంభం



లక్ష్మీ తిరుపతమ్మకు సారె తీసుకెళ్తున్న భక్తులు

గన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరం లక్ష్మీ తిరుప తమ్మ ఆలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సేవా సదనంను బుధవారం ప్రారంభించారు. తొలుత లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవా సదనం భవనాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణస్వామి వ్రతాన్ని జరిపారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాల వర్ధనరావు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్‌బాబు, తహసీల్దార్ కేవీ శివయ్య, ఎంపీడీవో టి.స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి చెన్న కేశ్వరరావు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



హెల్త్ వర్సిటీ వద్ద నిరసన తెలుపుతున్న తెలుగుయువత

హెల్త్ వర్సిటీలో వైఎస్ విగ్రహం తొలగించాలి

గుణదల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో వైసీపీ ప్రభుత్వం కక్షపూరిత ఆలోచనతో ఏర్పాటు చేసిన వైఎస్ విగ్రహాన్ని తొలగించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి డిమాండ్ చేశారు. వైఎస్ విగ్రహాన్ని తొలగించాలని కోరుతూ వర్సిటీ వద్ద నిరసన తెలియజేసిన అనంతరం యూనివర్శిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ సిహెచ్. శ్రీనివాసరావుకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. కక్షపూరిత ఆలోచనతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఎన్టీఆర్ ఆరోగ్యవిశ్వవిద్యాలయం పేరును వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చేయడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ పేరును తొలగించడమే కాకుండా బోర్డులు చెరిపేసి వైఎస్ విగ్రహాన్ని పెట్టడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైఎస్ఆర్ పేరును తొలగించి డాక్టర్ ఎన్టీఆర్ పేరు పెడుతున్నట్లుగా గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. నెల రోజులు కావస్తున్నా ఇంత వరకు వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోలేదన్నారు. వైఎస్ విగ్రహం తొలగింపు విషయమై తక్షణమే నిర్ణయం తీసుకోవాలన్నారు.

గుణదల మాత మహోత్సవాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలి



ఉత్సవ కమిటీ సమీక్షలో మాట్లాడుతున్న కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్

గుణదల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న గుణదల మాత 101వ మహోత్సవాలకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ఉత్సవ కమిటీకీ సూచించారు. గుణదల పుణ్యక్షేత్రం ప్రాంగణంలో గుణదల మాత 101వ మహోత్సవాలపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బిషప్ జోసఫ్ రాజారావు మాట్లాడుతూ, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కతోలిక పీఠం మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ, 2025 జనవరి 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు గుణదల కొండపై జరిగే నవదిన ప్రార్థనల్లో క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గుణదలమాత పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ, గుణదలమాత పుణ్యక్షేత్రంలో లూర్దు మాత భక్తుల నీరాజనాలు అందుకుంటుందన్నారు. సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్, ఫాదర్ పల్లె జోజిబాబు, ఫాదర్ పసల తోమస్, ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప, ఫాదర్ దామాల విజయ్‌కుమార్, నువ్వుల విజయరాజ్, సిస్టర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన ఆర్చర్లు

జాతీయ స్కూల్ గేమ్స్ ఆర్చరీలో ఏపీకి ఓవరాల్ చాంప్

విజయవాడస్పోర్ట్సు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గుజరాత్ రాష్ట్రం నడియాడ్‌లో ఈనెల 12న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన 68వ జాతీయ స్కూల్ గేమ్స్ ఆర్చరీలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు బంగారు పతకాలు సాధించడంతోపాటు బాలికల విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించినట్లు రాష్ట్ర ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జి .భానుమూర్తి రాజు బుధవారం తెలిపారు. ఆర్చరీ కాంపౌండ్‌లో బాలికల జట్టులో మాదల సూర్యహంసిని (భీమవరం), కర్రి సుష్మిత(కాళ్ల), రిషి కీర్తన కామినేని (విజయవాడ), స్ఫూర్తి వేగేసిన (కాళ్ల)బంగారు పతకాలను సాధించారన్నారు. ఆర్చరీ కాం పౌండ్ బాలికల 50 మీటర్ల వ్యక్తిగత విభాగంలో బంగారు పతకాన్ని మా దల సూర్యహంసిని సాధించిందన్నారు. రికర్వ్ రౌండ్‌లో బాలుర 60 మీటర్ల విభాగంలో కోదండ పాణి ధర్మేష్ జత్య(నెల్లూరు) స్వర్ణ పతకం సాధించాడన్నారు. సత్తా చాటిన ఆర్చర్లను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్‌రామరాజు, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అభినందించారు.



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న నాక్ బృందం

నాక్ బృందం ఏఎన్నార్ కళాశాల సందర్శన

గుడివాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అక్కినేని నాగేశ్వరరావు కళాశాలను ఈ నెల 11, 12 తేదీల్లో నాక్ బృందం సందర్శించింది. డాక్టర్ దిగంబర్ షిర్కే, డాక్టర్ మహేష్ గర్గ్, డాక్టర్ అమ్రిత్ గగోయ్‌ల బృందం మొదటి రోజు యూజీ, పీజీ విభాగాల్లో విద్యాబోధన, నాణ్యత ప్రమాణాలను ఐ.క్యూ. ఎ.సి కో-ఆర్డినేటర్ ఆధ్వర్యంలో పరిశీలించారు. రెండో రోజు ఐ.క్యూ. ఎ.సి.సభ్యులు, నాన్‌టీచింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. రెండు రోజుల పర్యటనలో బృంద పర్యవేక్షణలో వారు పరిశీలించిన అంశాలను ప్రస్తావిస్తూ నివేదికను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్‌కు అందజేశారు. నాక్ బృందానికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల పాలకవర్గ సభ్యులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడి కుటుంబానికి న్యాయాధికారి పరామర్శ



బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న శోభారాణి

పెనుగంచిప్రోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వీధి కుక్కల దాడిలో రెండు రోజుల క్రితం చనిపోయిన బాలుడు బాలతోటి ప్రేమ్ కుమార్ తల్లి దండ్రులు నాగమణి - గోపాల్‌రావులను జగ్గయ్యపేట జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.శోభారాణి బుధవారం రాత్రి పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును ఆమె అడిగి తెలుసుకుని వారిని ఓదార్చారు. జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందరరావు, తోటచర్లకు చెందిన సామ్యూల్ పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని మేజిస్ట్రేట్ ఎం.శోభారాణి పేర్కొన్నారు. పెనుగంచిప్రోలులోని బీసీ బాలుర సంక్షేమ వసతిగృహాన్ని ఆమె పరిశీలించారు. వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బార్ అధ్యక్షుడు సుందర్‌రావు, ఎస్.కె. అర్జున, బి.శంకర్ పాల్గొన్నారు.

దుర్గా కో-ఆపరేటివ్ ఖాతాదారుల ఆందోళన



వన్‌టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వన్‌టౌన్‌లోని దుర్గా కో- ఆపరేటివ్ అర్బన్‌లో అక్రమాల నేపథ్యంలో ఆర్‌బీఐ అధికారులు తనిఖీలు నిర్వహించి, బ్యాంకు లైసెన్స్‌ను రద్దు చేసిన నేపథ్యంలో ఖాతాదారుల్లో ఆందోళన నెలకొంది. పెద్ద సంఖ్యలో బ్యాంకు వద్ద డిపాజిట్ దారులందరూ బారులు తీరారు. ఖాతాదారులు ఆందోళనను, ఆవేదనను వ్యక్తం చేశారు. ఖాతాదారులేమంటున్నారో వారి మాటల్లోనే

రూ.15 లక్షలు డిపాజిట్ చేశా



ప్రభుత్వ ఉద్యోగిగా రూపాయి రూపాయి కూడగట్టి పలు దఫాలుగా నాలుగేళ్ల క్రితం రూ.15 లక్షలు డిపాజిట్ చేశారు. అప్పటి నుంచి కనీసం వడ్డీ కూడా ఇవ్వలేదు. డిపాజిట్లు వస్తాయో లేదో? ఎంతకాలం ఎదురు చూడాలో తెలియటం లేదు.

- ప్రసన్న కుమార్, చిట్టినగర్

మూడేళ్లయినా వడ్డీ ఇవ్వలేదు



మూడేళ్ల క్రితం రూ.5 లక్షలు డిపాజిట్ చేశారు. అప్పటి నుంచి వడ్డీ ఇవ్వలేదు. డిపాజిట్ తిరిగి ఇచ్చేయమని అడుగుతున్నా.. బ్యాంకు అధికారులు ఆర్బీఐ నిబంధనలు ఉన్నాయంటూ చెప్పుకొచ్చారు. డబ్బులు వస్తాయో లేదో తెలియటం లేదు.

- కృష్ణవేణి, వన్‌టౌన్

కుమార్తె వివాహం కోసం దాచా



రూపాయి రూపాయి కూడబెట్టుకుని కుమార్తె వివాహం నిమిత్తం బ్యాంకులో దాచుకున్నా. అవసరాల నిమిత్తం కొన్ని రోజుల నుంచి డబ్బులు ఇవ్వమని అడుగుతుంటే తరువాత ఇస్తామని చెబుతున్నారు. బ్యాంకు వద్దకు వచ్చి సిబ్బందిని అడిగితే ఇబ్బంది ఏమి ఉండదంటున్నారు.

- ఉప్పాల అచ్చమ్మ

రూ.50 లక్షలకు రెండేళ్ల నుంచి వడ్డీ కూడా ఇవ్వటం లేదు



ప్రభుత్వ ఉద్యోగం నుంచి రిటైర్డ్ అయిన తరువాత వచ్చిన రూ.50 లక్షలను రెండున్నర ఏళ్ల క్రితం డిపాజిట్ చేశాను. ఇప్పటి వరకు కనీసం వడ్డీ కూడా ఇవ్వలేదు. అసలు, వడ్డీ కలుపుకుంటే రూ.54 లక్షలు అయ్యింది. డబ్బులు ఇవ్వమని బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా ఆర్బీఐ నిబంధనల మేరకు లక్షన్నర రూపాయలు మాత్రమే ఇస్తామంటున్నారు.

- ఖాన్, రిటైర్డ్ ఉద్యోగి

డిపాజిట్ కాలపరిమితి ముగిసినా డబ్బు ఇవ్వలేదు



పలు దఫాలుగా 2019లో రూ.10 లక్షలు డిపాజిట్ చేశాను. ఆనాటి నుంచి ఇప్పటి వరకు వడ్డీ ఇవ్వలేదు. డిపాజిట్ కాలపరిమితి ముగిసినా డబ్బులు ఇవ్వలేదు. మూడునెలలకు ఒకసారి రెన్యూవల్ చేసుకుంటున్నాను. డబ్బులు లేకపోవటంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం.

- గంగాధర్, ప్రైవేటు ఉద్యోగి

డిపాజిట్‌దారులకు అన్యాయం జరగదు



బ్యాంకు ఇచ్చిన రుణాలు అసలు రూ.50 కోట్లకు వడ్డీ కలిపి రూ.200 కోట్లు రావాల్సి ఉంది. ప్రస్తుతం బ్యాంకు వద్ద రూ.60 కోట్లు ఉన్నాయి. ఆర్బీఐ అధికారులు పర్యవేక్షణలో బ్యాంకు లావాదేవీలు జరుగుతాయి. డిపాజిట్‌దారులకు అన్యాయం జరగదు. అయిదారు రోజుల్లో లిక్విడేటర్‌ను నియమిస్తారు. ఆర్బీఐ అధికారుల ఆదేశాలు, బ్యాంకు నిబంధనల మేరకు డిపాజిట్‌దారులకు డబ్బులు ఇవ్వటం జరుగుతుంది.

- బంకా శ్రీనివాసరావు, సెక్రటరీ, దుర్గా కో-ఆపరేటివ్ బ్యాంకు

స్వాతంత్ర్య సమరయోధురాలు నరసాయమ్మ కన్నుమూత



రాంపిళ్ల నరసాయమ్మ భౌతికకాయం (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

చిట్టినగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు రాంపిళ్ల నరసాయమ్మ (95) బుధవారం విజయవాడలో కన్నుమూశారు. నరసాయమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. ఆమె పెద్ద కుమారుడు హనుమత్ దీక్షాపీఠం పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామిజీ. రెండో కుమారుడు రాంపిళ్ల జయప్రకాష్ స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జాతీయ కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. మూడో కుమారుడు గౌరీ శివశంకర్ కొత్తపేటలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్తగా ఉన్నారు. కుమార్తె తమ్మిన గౌరీబాయి వ్యాపార రంగంలో ఉన్నారు.

తెల్లదొరలను ఎదుర్కోవాలనే లక్ష్యంతో తన భర్త సర్దార్ రాంపిళ్ల సూర్యనారాయణతో కలిసి ఆమె విజయవాడ పాల ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న కొండపై బాంబులు తయారు చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన బ్రిటీష్ ప్రభుత్వం నరసాయమ్మ, సూర్యనారాయణ దంపతులపై బెజవాడ బాంబు కుట్ర కేసు పెట్టి అరెస్టు చేసింది. కొన్ని నెలలపాటు బ్రిటీష్ పాలకు నరసాయమ్మను జైలులో నిర్బంధించారు. స్వాతంత్ర్యానంతరం గోవా దీవుల విముక్తి పోరాటంలో భర్త సూర్యనారాయణతో కలిసి నరసాయమ్మ పాల్గొని జైలు జీవితం గడిపారు. ఆమె జైలులో ఉన్న సమయంలోనే రెండో కుమారుడు రాంపిళ్ల జయప్రకాష్ పుట్టారు. దేశ అభ్యున్నతికి గాంధీ మార్గమే ఉత్తమమని భావించి గాంధీ దేవాలయాన్ని స్థాపించారు. గాంధీ దీక్షలను ప్రచారం చేశారు. కేంద్రప్రభుత్వం హోంమంత్రిత్వ శాఖ సలహా మండలిలో నరసాయమ్మకు స్థానం కల్పించడంతో స్వాతంత్ర్య సమరయోధుల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేశారు. సమరయోధులకు పెన్షన్ భారీగా పెంచడంలో నరసాయమ్మ పాత్ర ఎనలేనిది. రాష్ట్రపతులు ప్రణబ్ ముఖర్జీ, రామనాథ్ కోవింద్ వంటి ప్రముఖుల చేతుల మీదుగా నరసాయమ్మ పలు మార్లు సత్కారాలను అందుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పలు సందర్భాల్లో నరసాయమ్మను సత్కరించారు. పలు జాతీయ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని తన ప్రసంగాల ద్వారా జాతిని ఉత్తేజితం చేశారు. తన మామగారు సయ్యద్ రాంపిళ్ల అప్పలస్వామి నెలకొల్పిన సయ్యద్ అప్పలస్వామి కళాశాల అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేశారు. నిరాడంబర జీవితం, పరోపకార బుద్ధి వంటి మహోన్నత గుణాలతో విద్యార్థులకు నరసాయమ్మ ఆదర్శంగా నిలిచారు. నరసాయమ్మ మృతి వార్త తెలియగానే పలువురు ప్రముఖులు తరలివచ్చి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. భారతదేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. నరసాయమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మహిళ ఇల్లు కబ్జాకు యత్నం

- వైసీపీ నాయకుడి అరాచకం
- ఇల్లు ఖాళీ చేయాలంటూ ఒత్తిడి
- సీపీని ఆశ్రయించిన బాధితురాలు



బాధితురాలు కొనుగోలు చేసిన ఇల్లు (ఇన్‌సెట్లో బాధితురాలు ఎస్తేరు రాణి)

వన్‌టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో స్థలాల కబ్జాకు పాల్పడిన డివిజన్ నాయకులు ప్రభుత్వం మారినా తమ తీరు మార్చుకోలేదు. సింగ్‌నగర్‌లోని పేద మహిళ ఇల్లు కబ్జా చేయటానికి 60 వ డివిజన్ నాయకుడు యత్నించాడు. ఇల్లు ఖాళీ చేయాలంటూ వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో బాధితురాలు విజయవాడ నగర పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించింది.

రైల్వే బొగ్గులైన్ క్వార్టర్స్‌లో బత్తుల ఎస్తేరు రాణి (55) నివాసం ఉంటోంది. ఆమె భర్త చిన్నారావు విధి నిర్వహణలో చనిపోవటంతో ఆమెకు రైల్వే అధికారులు ఉద్యోగం ఇచ్చారు. ప్రస్తుతం ఆమె రైల్వే గ్యాంగ్ ఉమన్‌గా పనిచేస్తోంది. ఆమెకు ఒక కుమారుడు. అతను వివాహం చేసుకుని వేరే ప్రాంతంలో ఉంటున్నాడు. ఆమె ఉద్యోగం చేసుకుంటూ ఒంటరిగా ఉంటోంది. భర్త చనిపోయిన తరువాత వచ్చిన డబ్బుతో ఆమె ఈ ఏడాది అయిదో నెలలో 60వ డివిజన్ సింగ్‌నగర్ వాంబేకాలనీ, గాంధీబొమ్మ సెంటర్ వద్ద 42 గజాల డాబాను రవితేజ వద్ద కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆమె తన ఇంటిని ఒక కుటుంబానికి అద్దెకు ఇచ్చింది. ఎస్తేరు రాణి కొనుగోలు చేసిన ఇల్లు తనదేనని, ఖాళీ చేయాలని అద్దెకున్న వారికి చెప్పడంతో పాటు ఎస్తేరు రాణికి శ్రీనివాసరెడ్డి ఫోన్ చేసి వేధిస్తున్నాడు. నున్న పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాడు. సానికొమ్ము శ్రీనివాసరెడ్డి గుడివాడలోని స్టాంపు వెండర్ వద్ద పాత స్టాంపు పేపర్ కొనుగోలు చేసి ఆ ఇల్లును కొనుగోలు చేసినట్లు అక్రమంగా పత్రాలు సృష్టించాడు. ఆ పత్రాలతో ఆ ఇల్లు తనదేనంటూ ఆమెను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఇల్లు ఖాళీ చేయకపోతే బలవంతంగా ఖాళీ చేయిస్తానని బాధితురాలిని బెదిరిస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసు కమిషనర్‌ను ఆశ్రయించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేయాలని నున్న పోలీసులకు ఆదేశించారు. వైసీపీ నాయకుడు పోలీసులపై కూడా ఒత్తిడి చేస్తూ బలవంతంగా ఇల్లు ఖాళీ చేయించటానికి ప్రయత్నిస్తున్నాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. సానికొమ్ము శ్రీనివాసరెడ్డి వైసీపీ ప్రభుత్వ హయాంలో 60వ డివిజన్ పరిధిలో ఎక్సెల్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న జేఎన్ఎన్‌యుఆర్ఎం ఇళ్ల పక్కన ఖాళీగా ఉన్న నగరపాలక సంస్థకు చెందిన విలువైన స్థలం కబ్జా చేసి దుకాణం ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చాడు. ప్రభుత్వం మారిపోవటంతో ఇటీవల దుకాణాన్ని తొలగించారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- ప్రకృతి సంరక్షణ చాలా అవసరం
- ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురూజీ రవిశంకర్



విజయవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ మంచి నగరమని ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురూజీ రవిశంకర్ వ్యాఖ్యానించారు. బబ్బూరి గ్రౌండ్స్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన మహా సత్సంగ్‌లో పలువురి ప్రశ్నలకు ఆయన చాలా వేగంగా జవాబులు ఇచ్చారు. దీనితోపాటు నగరంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భిన్నత్వంలో ఏకత్వం అనే అంశపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్ పాల్గొన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మైనారిటీ శాఖ మంత్రి ఎండీ ఫరూక్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫరూక్ షుబ్లీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్న: ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఎలా ఏర్పడింది?

జవాబు : సీజేఐలుగా పని చేసిన భగవతి, వీఆర్ కృష్ణయ్య, ఫాదర్ ఆఫ్ బెంగళూరు సిటీ డాక్టర్ లక్ష్మణరావు, శాస్త్రి ముఖ్యకారకులు. వారిలో కృష్ణయ్య హేతువాది. భగవతి విశ్వాసకుడు.

ప్రశ్న: ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా మార్పును ఎలా తీసురాగలుగుతున్నారు?

జవాబు : అందరూ నా వాళ్లే అనుకుంటూ కృషి చేస్తున్నాను. తద్వారా సమాజంలో మార్పు తీసుకురాగలుగుతున్నా

ప్రశ్న: ఇటీవల వచ్చిన వరదలకు ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు. ఎలా ఎదుర్కోవాలి?

జవాబు : ఆత్మవిశ్వాసంతో అన్ని కష్టాలను జయించవచ్చు. ప్రతి మనిషిలో ధైర్యం, దైవంపై విశ్వాసం ఉండాలి. ప్రకృతి వైపరీత్యాలు రావడం సాధారణం. ప్రకృతి సంరక్షణ చాలా అవసరం. చెరువులు, నదులు, కాల్వలు, వృక్షసంపదను పరిరక్షించుకోవాలి. నగరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇది మన బాధ్యతగా గుర్తించుకోవాలి.

ప్రశ్న: మనుషులు ఎందుకు స్వచ్ఛంగా ఉండలేకపోతున్నారు?

జవాబు : ప్రతి ఒక్కరూ పుట్టుకతో మంచివారు. మనది నిత్యశుద్ధిబుద్ధి స్వభావం. అన్నింటినీ కనుక్కోవాలి. అదే ఆత్మశుద్ధి. ఒత్తిడి, టెన్షన్ తగ్గితే మానవత్వం బయటకు వస్తుంది.

ప్రశ్న: గురువు ఆవశ్యకత ఏమిటి?

జవాబు : ప్రతి మనిషికి ప్రథమ గురువు తల్లి. తర్వాత గురువు ఆచార్యుడు. ప్రశ్నలకు జవాబులు తెలియాలంటే గురువులు ఉండాలి. గురువు అంటే ధైర్యాన్ని ఇచ్చేవాడు. సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ గురువు పాత్రను పోషించాలి.

ప్రశ్న: చెడు కర్మల నుంచి ఎలా బయట పడాలి?

జవాబు : జీవితంలో గానం, ధ్యానం, జ్ఞానం ఉంటే చెడు కర్మలు తొలగిపోతాయి.

ప్రశ్న: పిల్లలు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా ఉండాలంటే?

జవాబు : రెండు రోజులపాటు సెల్‌ఫోన్లకు చార్జింగ్ పెట్టకండి. తర్వాత పిల్లలు ఆ వ్యసనం నుంచి బయటకు వచ్చేస్తారు.

ప్రశ్న: పెద్దలు చెప్పిన మాటలు విద్యార్థులకు అర్థం కావడం లేదు. ఏం చేయాలి?

జవాబు: దీనికోసమే ఆర్ట్ ఆఫ్ లివింగ్ నో యువర్ టీన్స్ అనే కోర్సును డిజైన్ చేసింది. రెండు రోజులు రెండు గంటలపాటు ఈ కోర్సులో ఉంటే అన్ని బోధపడతాయి. విద్యార్థులకు సహనం ఉండాలి. ధ్యానం చేయాలి. మెంటల్ హెల్త్‌కు అటెన్షన్ ఇవ్వాలి. వ్యాయామం, ధ్యానం చేసి విశ్రాంతి తీసుకుంటే అన్ని విషయాలు తలకెక్కుతాయి.

ప్రశ్న: యువత డ్రగ్స్‌కు ఎందుకు బానిసలవుతున్నారు?

జవాబు : యువత కొత్త అనుభూతిని కోరుకుంటున్నారు. పంచేంద్రియాల్లో గొప్ప అనుభూతి కోసం చూస్తున్నారు. దీని కోసం కొత్త అలవాట్లు చేసుకుంటున్నారు. కొంతమంది మద్యం తాగుతున్నారు. మరికొంతమంది డ్రగ్స్ తీసుకుంటున్నారు. వాటిల్లో ఏదో అనుభూతి ఉందనుకుంటున్నారు. అందుకే వాటికి అలవాటు పడుతున్నారు. ఇలా బానిసలైన వారిని సుదర్శనక్రియ ద్వారా బయటకు తీసుకురావచ్చు. ప్రపంచంలో ఎంతోమంది ఇలా బయటకు వచ్చారు. ఆత్మహత్య చేసుకోవాలనుకున్న వారిలో విశ్వాసం కలిగించాలి. ప్రేమ అనేది ఒక వైబ్రేషన్. సంసారం ఇదే కోవకు వస్తుంది.

- మీకు నచ్చిన వ్యక్తి.. ప్రతి ఒక్కరూ ఇష్టమే
- మీకు నచ్చిన దేశం... మనిషి అంతర్గతంగా ఉండే దేశం
- చిరునవ్వుకు కారణం.. ఆర్ట్ ఆఫ్ లివింగ్
- ఫోన్ నంబర్... కళ్లు మూసుకుని ధ్యానం చేస్తే కనెక్ట్ అవుతా
- ఆధ్యాత్మికత.. అందరికీ అవసరం
- వాట్సాప్..ఉన్నత స్థాయికి వెళ్లడానికి (వాట్ ఈజ్ అప్) అవసరమైనది
- విజయవాడ..మంచినగరం
- ఆయుర్వేదం... మెడిసిన్ ఆఫ్ కరెంట్ సెంచరీ
- రాజకీయాలు.. ప్రజలు ఉన్న చోట రాజకీయం.
- టీచర్స్ అండ్ వలంటీర్స్ .. గిఫ్ట్ ఆఫ్ ది సొసైటీ

గంగరాజు, షుబ్లీకి సత్కారం

బబ్బూరి గ్రౌండ్స్‌లో జరిగిన సత్సంగ్‌లో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీని రవిశంకర్ సత్కరించారు. గంగరాజు 80వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయనకు గురూజీ ఆశీస్సులు అందజేశారు. సర్వమత సమ్మేళనంలో భాగంగా ఫారూక్ షుబ్లీని వేదిక పైకి ఆహ్వానించి సత్కరించారు.



మాజీ ఎంపీ గంగరాజు, మైనార్టీ నేత షుబ్లీని సత్కరిస్తున్న రవిశంకర్

షరీఫ్‌కు సన్మానం

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారుగా నియమితులైన శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్‌ను టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో షరీఫ్‌ను ఏవీ రమణ, డి.నరేంద్రబాబు, రవియాదవ్, శంకర్‌నాయుడు, కట్టా జనార్దన్, రాజశేఖర్, సత్యవాణి తదితరులు శాలువాలతో సన్మానించారు.

ఫైబర్‌నెట్ చైర్మన్‌గా జీవీ రెడ్డి ప్రమాణ స్వీకారం రేపు

ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్‌గా నియమితులైన జీవీ రెడ్డి ఈనెల 15న పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

విజయవాడ బస్టాండ్ కాంప్లెక్స్‌లోని మూడో అంతస్థులోని ఏపీఎస్ఎఫ్ఎల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని జీవీ రెడ్డి తెలిపారు.

సీఎంతో బ్రిటీష్ హైకమిషనర్ భేటీ

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ హైకమిషనర్ లిండే కెమెరాన్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును అసెంబ్లీలోని చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇండియా-యూకే భాగస్వామ్యంపై చర్చించారు. దీనిపై సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ.. ఆమెను కలవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

క్రీడారంగానికి పూర్వ వైభవం

- క్రీడా అకాడమీలు, ప్రతి గ్రామంలో ఆటస్థలం, స్పోర్ట్సు విలేజ్‌లు సిద్ధం
- శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు



విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ క్రీడారంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి నూతన క్రీడా పాలసీతో ముందుకెళ్తున్నామని, మట్టిలో ఉన్న మాణిక్యాలకు సానపెట్టేందుకు ప్రత్యేక కార్యక్రమం రూపొందిస్తామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ..

? క్రీడల అభివృద్ధికి మీ ప్రణాళిక

శాప్ చైర్మన్ : రాష్ట్రంలో 2027 నాటికి కుగ్రామం నుంచి ప్రతి టౌన్ వరకు ఆట స్థలాలు అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు సాగుతాం. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వలన ఆగిపోయిన నిర్మాణాలను పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తా. క్రీడా వికాస కేంద్రాలు, ఇండోర్ స్టేడియం నిర్మాణాలను పూర్తి చేస్తాం.

? ప్రభుత్వం నుంచి ఆర్థిక తోడ్పాటు లేకుండా క్రీడల అభివృద్ధి ఎలా

శాప్ చైర్మన్ : అసోసియేషన్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను రాష్ట్ర క్రీడాభివృద్ధిలో భాగం చేస్తా. ప్రతి పనిలో భాగస్వామ్యం చేసి నిధుల సమీకరణ చర్యలు తీసుకుంటా. వారి పరిధిలోనే వాకింగ్ ట్రాక్‌లు అభివృద్ధి చేస్తాం. ఎమ్మెల్యే నిధుల్లో 20 శాతం క్రీడలకు కేటాయించాలని కోరతా.

? కోచ్‌ల ఖాళీలను ఎలా భర్తీ చేస్తారు.

శాప్ చైర్మన్ : కోచ్‌ల నియామకం పెద్ద సమస్య. వచ్చే ఏడాది మార్చి తర్వాత కోచ్‌ల భర్తీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటా. ప్రతిభ, సీనియార్టీ ఆధారంగా కోచ్‌ల వేతనం కొంత పెంచే యోచన ఉంది.

? శాప్ పాలకవర్గాన్ని ఎప్పుడు ప్రకటిస్తారు

శాప్ చైర్మన్ : అతి త్వరలోనే పాలకవర్గం ప్రకటిస్తాం. గతంలో ఎంతమంది సంఖ్య ఉందో దానికి లోబడే భర్తీ చేస్తాం.

? శాప్, పీపీపీ మోడ్‌తో అకాడమీలు ప్రారంభించే యోచన ఉందా

శాప్ చైర్మన్ : పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐలను కలుపుకుని పీపీపీ (పబ్లిక్, ప్రవేట్, పార్టనర్‌షిప్)తో అకాడమీలు, మల్టీపర్పస్ ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలను నిర్మిస్తాం. పారిశ్రామిక రంగాల నుంచి సీఎస్ఆర్ ఫండ్స్‌ను సమీకరిస్తాం.

? జాతీయ క్రీడల ఆతిథ్యానికి సిద్ధం యాక్షన్ ప్లాన్ ఏమిటీ

శాప్ చైర్మన్ : రాష్ట్రంలో 2026-27లో జాతీయ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా సీఎం చంద్రబాబు దృఢ సంకల్పంతో ప్రణాళిక రూపొందిస్తున్నారు. మంగళగిరి, తిరుపతి, కాకినాడ, విశాఖపట్నం, కర్నూలలో స్పోర్ట్సు విలేజ్‌ల నిర్మాణానికి రంగం సిద్ధం అవుతోంది. తిరుపతిలో కలెక్టర్ స్థలం కేటాయించారు. గుంటూరులో మంత్రి లోకేష్ చూస్తున్నారు. రాజమహేంద్రవరంలో పురందేశ్వరి ద్వారా తగు చర్యలు తీసుకుంటున్నాం.

? ఫేక్ క్రీడా సర్టిఫికెట్ల జారీని ఎలా అడ్డుకుంటారు

శాప్ చైర్మన్ : నకిలీ సర్టిఫికెట్లతో క్రీడాకారులను నడిపించే అసోసియేషన్ల ఆట కటిస్తాం. ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు. ఉద్యోగాల విషయాల్లో క్రీడాకారులకు అన్యాయం జరగకుండా ఉండేందుకు క్రీడాశాఖ మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి, శాప్ ఎండీ, ఇతర ఉన్నతాధికారులు దీనిపై చర్చించారు. క్రీడా సర్టిఫికెట్ల జారీపై నిరంతరం నిఘా కోసం యాప్‌ను రూపొందిస్తున్నాం. ఆధార్, క్రీడా ట్రాక్ రికార్డులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	115,124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.535

తాగునీటి సరఫరాలో అలసత్వం వహిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

గుడివాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తాగునీరు సరఫరా, పారిశుధ్య నిర్వహణ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ, పైపులైన్ లీకేజీల మరమ్మతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇంటి, ఆస్తి పన్నుల వసూళ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పైపులైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

స్వచ్ఛ తోట్లవల్లూరు ప్రశ్నార్థకం

● దుర్వాసనతో కరకట్ట ప్రయాణికుల వెతలు ● లక్ష్యానికి దూరంగా సంపద కేంద్రం

తోట్లవల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తోట్లవల్లూరులో చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా తయారయింది. లక్షలు వెచ్చించి నిర్మించిన సంపద కేంద్రం లక్ష్యానికి దూరంగా మిగిలింది. కృష్ణానది వరదకు ఈ సంపద కేంద్రం మునిగిపోగా మళ్లీ దానిని గాడిలో పెట్టలేదు. ఫలితంగా రోజూ వచ్చే చెత్తను పంచాయతీ పారిశుధ్య సిబ్బంది కరకట్టపైనే సంపద కేంద్రానికి దగ్గర్లో గుట్టగా పోస్తున్నారు. వరదకు ముందు కూడా ఈ విధంగానే చెత్తను ట్రాక్టర్లో తెచ్చి కరకట్టపైనే వేసేవారు. ఈ చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. సంపద కేంద్రంలో చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ జరుగుతుంటే చెత్త వ్యర్థాలు ఇలా రోడ్లపై వేసే పరిస్థితి వచ్చేది కాదు. అలాగే అనేకచోట్ల పంచాయతీ పారిశుధ్య సిబ్బంది చెత్తను పోగుచేసి తగుల బెడుతున్నారు.



సంపద కేంద్రం వద్ద చెత్తాచెదారం



ఆరోగ్య ఉపకేంద్రం దగ్గర చెత్తాచెదారం

పదివేల మంది జనాభా ఉన్న తోట్లవల్లూరులో చెత్త సమస్యపై అధికారులు తగిన దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

స్వచ్ఛ తోట్లవల్లూరు కార్యక్రమాన్ని 2017లో అప్పటి సర్పంచ్ చిరుమామిళ్ల ఉమాదేవి, టీడీపీ నాయకుడు వీరంకి వెంకట గురుమూర్తి గ్రామస్తుల సహకారంతో చేపట్టారు. వంద రోజుల పాటు రోడ్లను శుభ్రం చేయటం, ఎక్కడ చెత్త ఉన్నా తొలగించి శుభ్రం చేయటం, ప్రభుత్వ ఆవరణలను బాగు చేయటం చేశారు. ఇది ఉద్యమంగా సాగింది. దాంతో ప్రజల్లో కూడా కొంత చైతన్యం వచ్చింది. ఆ తరువాత ఈ కార్యక్రమాన్ని ఆపివేయటంతో స్వచ్ఛత లోపించింది. మళ్లీ ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టటం, చెత్త సంపద కేంద్రాన్ని ఉపయోగంలోకి తేవటం ద్వారా స్వచ్ఛ తోట్లవల్లూరును సాధించే అవకాశం ఉంది.

బాలబాలికలకు ఆటల పోటీలు



కబడ్డీ ఆడుతున్న బాలికలు

గుడ్లవల్లేరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌కు చెందిన వి క్యూబ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ వారి వి క్యూబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల బాలబాలికలకు బాలల దినోత్సవం సందర్భంగా బుధవారం రెండోరోజు ఆటలపోటీలు నిర్వహించారు. అంగలూరు డైట్ కళాశాల ఆవరణలో అంగలూరు బాలికోన్నత పాఠశాల బాలికలకు కబడ్డీ, ఖోఖో పోటీలు, బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జి.గోపాలరావు, జి.జగ్మోహనరావు, డైట్ సీనియర్ లెక్చరర్ వినయ్ కుమార్, వి క్యూబ్ ఫౌండర్ పామర్తి వీర రాఘవరావు, మోదుగమూడి అంకాలరావు తదితరులు పాల్గొన్నారు. గురువారం విజేతలకు బహుమతి ప్రదానం అంగలూరు బాలికోన్నత పాఠశాలలో జరుగుతుందని నిర్వాహకులు మోదుగమూడి అంకాలరావు తెలిపారు.



మొవ్వలో ప్రిన్సిపాల్ ప్రసాద శాస్త్రిని సత్కరిస్తున్న అధ్యాపకులు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

కూచిపూడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత, మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ప్రసాద శాస్త్రిని బుధవారం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో అందరి సమష్టి కృషితో క్షేత్రయ్య కళాశాలను రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపారు.

బాస్కెట్‌బాల్ విజేతకు అభినందనలు

పెదపారుపూడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో బంగారు పతకాన్ని స్కేటింగ్ విభాగంలో రెండు కాంస్య పతకాలను వైజ్యూడ్స్ స్కూల్ 12వ తరగతి విద్యార్థిని గంజి సాయి తేజస్విని సాధించింది. తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని స్కూల్ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, మంజుల, ప్రణీత్, ఇన్‌చార్జి ఎల్.హరిబాబు తదితరులు విద్యార్థిని సాయి తేజస్విని అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్‌లో మాంటిస్సోరి విద్యార్థి ప్రతిభ



విద్యార్థి రెహమాన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుడివాడ, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం జిల్లా, ఎంసీహెచ్ పాఠశాలలో జరిగిన 68వ ఎస్.జి.ఎఫ్ అండర్-19 అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు బంగారు పతకం సాధించడంలో మాంటిస్సోరి పాఠశాల విద్యార్థి షేక్ రెహమాన్ విశేష ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల పాలకవర్గ అధ్యక్షులు వి.లక్ష్మీ తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థి రెహమాన్ అభినందన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పీవీవీ రమాదుర్గ, ప్రధానోపాధ్యాయిని జి.పద్మావతి, ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, కోచ్ సత్యఅన్వేష్, తదితరులు అభినందించారు.

నిస్వార్థ రాజకీయాలకు నిదర్శనం రావి

గుడివాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనంగా, గుడివాడ రాజకీయ చరిత్రలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించుకున్న వ్యక్తి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు కొనియాడారు. బుధవారం స్థానిక ప్రజావేదికలో రావిని యలవర్తి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా రావిని నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వసంతవాడ దుర్గారావు, యలవర్తి యువసేన సభ్యులు శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రావిని సత్కరిస్తున్న యలవర్తి

ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్ చైర్మన్‌కు ఘనసత్కారం

గుడివాడ, నవంబరు13 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియమితులైన టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకవరపు సునీల్‌ను పలువురు సత్కరించి అభినందనలు తెలిపారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ విస్సంశెట్టి కృష్ణకిషోర్, గుడివాడ చైర్మన్ ఉప్పలపాటి సతీష్‌కుమార్, సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు అభినందించి ఘనంగా సత్కరించారు.



సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కూచిపూడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 57వ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాలను మొవ్వ శాఖ గ్రంథాలయంలో గురువారం నుంచి వారం రోజులపాటు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి టి.కృష్ణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన, విద్యార్థులచే విచిత్ర వేషధారణ, వ్యాసరచన, వక్తృత్వం, రంగవల్లులు, డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, డ్రాయింగ్ తదితర అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ముగింపు రోజున విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్లు కృష్ణకుమారి తెలిపారు.

పామర్రు: పామర్రు పట్టణంతోపాటు జమీగోల్వేపల్లి గ్రామంలోని గ్రంథాలయాల్లో గురువారం నుంచి ఈ నెల 20వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారులు ఝాన్సీలక్ష్మి, వి. నాగసురేష్‌లు బుధవారం తెలిపారు.

శాకాహారంపై అవగాహన ర్యాలీ

తోట్లవల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : శాఖాహారం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ధ్యానం చేయటం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను మందులు లేకుండానే జయించవచ్చని పిరమిడ్ ధ్యాన కేంద్రం జిల్లా అధ్యక్షురాలు కె. రాజకుమారి అన్నారు. రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రం 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణాజిల్లా పిరమిడ్ సేవాదళ్ సభ్యులు తోట్లవల్లూరులో బుధవారం శాఖాహార ర్యాలీ నిర్వహించారు. రాజకుమారి, జిల్లా పిరమిడ్ సేవాదళ్ కన్వీనర్ మూడే శివశంకర్, సేవాదళ్ మాష్టారు స్వర్ణలత, తోట్లవల్లూరు వశిష్ఠ ధ్యాన కేంద్రం నిర్వాహకుడు జాస్తి సాంబశివరావు, గాంధీ, చంద్రశేఖర్, తాడికొండ లక్ష్మీ, శ్రీదేవి తదితరులు శాఖాహార ర్యాలీ నిర్వహిస్తు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివాలయంలో ప్రజలకు, జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో రాజకుమారి మాట్లాడుతు ధ్యానంపై పట్టు సాధిస్తే విద్యార్థులు చదువులో అద్భుతంగా విజయం సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు ధ్యానం, శాఖాహారం విలువను తెలిపే పుస్తకాలను పంపిణీ చేశారు.



ర్యాలీ చేస్తున్న ధ్యానకేంద్రం సభ్యులు



కరపత్రాలు విడుదల చేస్తున్న నేతలు

ప్రజా సమస్యలపై నేడు సీపీఎం ధర్నా

కూచిపూడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు మొవ్వ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఈ కార్యక్రమాన్ని సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, నిత్యావసర ధరలు తగ్గించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ రద్దు చేయాలని, తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని తదితర సమస్యలపై సీపీఎం పోరాటం చేయనున్నట్లు నారాయణరావు తెలిపారు.

ఆవులను తప్పించబోయి మృతి

గుడివాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లాయిపాలెం శివారు డ్రైవర్స్ కాలనీకి చెందిన మోదుగుమూడి రంగారావు ద్విచక్రవాహనంపై మంగళవారం అర్ధరాత్రి స్థానిక బంటుమిల్లి రోడ్డులో వెళుతుండగా ఆవులను తప్పించబోయి లారీ కిందపడటంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. రహదారులపై ఆవులను నియంత్రించాలని కోరుతూ పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామని, అధికారులు చర్యలు చేపట్టలేదని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి ఆరోపించారు. క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడగా మారుస్తానని స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఆవుల యజమానులు కూడా ఇష్టానుసారంగా తమ పశువులను రహదారులపై వదిలేస్తున్నారన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలోని బందెలదొడ్డికి ఆవులను తరలిస్తే ఇలాంటి సంఘటనలు జరగవన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆవుల తరలింపు విషయంపై దృష్టి సారించాలని కోరారు. మృతుని కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి రేపాని కొండ పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు



రైతులకు సూచనలిస్తున్న రమాదేవి

వరి కోతలు వాయిదా వేసుకోండి

గుడివాడ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ కేంద్రం తుఫాన్ ఉందని హెచ్చరిస్తున్నందున రైతులు వరి కోతలను కొన్ని రోజులు వాయిదా వేసుకోవాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి సూచించారు. బుధవారం ఏడీఏ కార్యాలయంలో నిమ్మగడ్డ రమాదేవి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడివాడ వ్యవసాయ డివిజన్‌లోని రైతులు ప్రతీ రోజు వాతావరణ సమాచారం తెలుసుకోవాలని కోరారు. రైతులు తొందరపడి వరి కోయవద్దన్నారు. వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో అనంతలక్ష్మి, మండల విస్తరణాధికారులు వి.అనిత, బి.అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులు సక్రమంగా పనిచేయాలి

గుడివాడ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉన్నత ప్రధానోపాధ్యాయులు సక్రమంగా పని చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.వి.రామారావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గుడివాడ డివిజన్‌లోని ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మండలంలో ఉత్తీర్ణత శాతం పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. మండలంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరూ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు బోధించే విధంగా కృషి చేయాలని తెలిపారు. డిప్యూటీఈవో పద్మారాణి మాట్లాడుతూ పాఠశాలల పనితీరు మెరుగుపర్చుకోవాలని, కొంతమంది ఉపాధ్యాయులు సక్రమంగా బోధించటం లేదని, వారి ప్రావీణ్యతను మెరుగుపర్చుకోవాలన్నారు. ఎంఈవోలు విజయ్, బాలాజీ, డివిజన్‌లోని ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీవీ రామారావు



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న చౌదరి

విద్యార్థులకు కళ్లజోళ్లు

గుడ్లవల్లేరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. గుడ్లవల్లేరు ఏఏఎస్ఎం హైస్కూల్‌లో 60 మంది విద్యార్థులకు, అంగలూరు బాలికోన్నత పాఠశాలలో 33 మందికి, అంగలూరు బాలుర ప్రభుత్వ హైస్కూల్లో 12 మందికి ఏఆర్‌కే చౌదరి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శశికళ, మాజీ లయన్స్ గవర్నర్ వైపీసీ ప్రసాద్, హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, పరంధామయ్య, విశ్వేశ్వరరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

పామర్రు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పయనించడం ఎంతో అవసరమని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం ఇస్తున్న నిధులను సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో చర్చించి ప్రజలకు అవసరమైన పనులు చేపట్టేందుకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలన్నారు. ఎంపీడీవో కెజ్యోతి, ఎంఈవో జి.పద్మవాణి, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి

కార్తీక వనసమారాధన

పెదపారుపూడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంట్ర ప్రగడ గ్రామంలో శ్రీ నామేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించిన కార్తీక వనసమారాధన అత్యంత వైభవంగా జరిగింది. దేవాలయ ఆవరణలో వనసమారాధన జరిగింది,

వీరబ్రహ్మేంద్ర స్వామి బోధనలు అజరామరం

గుడివాడ, నవంబరు13(ఆంధ్రజ్యోతి) : భక్తి, సామాజిక మార్గాల్లో కాలజ్ఞాన ప్రబోధకుడు శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి బోధనలు అజరామరమని, అనుసరణీయమని విశ్వకర్మ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు వసుధ బసవేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారి 416వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. గాయకులు శనగపాటి నాగేశ్వరరావు, బిళ్లపాడుకు చెందిన రాంపండు, హనుమంతరావుల బృందం వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞాన తత్వాలను ఆలపించారు. తొలుత స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళ భక్తులు ఆలయ ప్రాంగణంలో 416 దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చింతలూరి సత్యనారాయణ, దేవస్థాన కమిటీ సభ్యులు రాచకుళ్ల సురేష్‌బాబు, యలమర్తి కోటేశ్వరరావు, పామర్తి రాజారావు, ఆముదాలపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వసుధ బసవేశ్వరరావు



లోకేష్‌తో గోకవరపు సునీల్



రావి, వెనిగండ్లతో మజ్జాడ నాగరాజు

గుడివాడకు మరో రెండు నామినేటెడ్ పదవులు

గుడివాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ పదవుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు మరోమారు గుడివాడకు పెద్దపీట వేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా గుడివాడకు చెందిన గోకవరపు సునీల్‌ను ఎంపిక చేశారు. ఈయన ప్రస్తుతం టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నందివాడ మండలం లక్ష్మీనరసింహపురంకు చెందిన మజ్జాడ నాగరాజును ఎంపికయ్యారు. ఈయన ప్రస్తుతం టీడీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. పార్టీ అభివృద్ధి, అభ్యున్నతికి కృషి చేసిన గోకవరపు, మజ్జాడలకు పదవులు దక్కడం పట్ల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

వెంకటేశ్వరస్వామి వార్షిక పవిత్రోత్సవాలు

గుడివాడ, నవంబరు13(ఆంధ్రజ్యోతి) : స్థానిక పాటిమీద ఉన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉత్సవాల్లో భాగంగా అగ్ని ప్రతిష్ఠ, యాగశాల ప్రవేశం, పవిత్ర ఆదివాసం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.535

విద్యార్థినులకు అండగా శక్తి టీంలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే శక్తి టీములు అండదండలుగా ఉంటాయని మహిళా పోలీసు ఇన్‌స్పెక్టర్ వాసా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం జార్జి కార్నేషన్ హైస్కూల్‌లో మహిళా పోలీసు, శక్తిటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల ఏర్పడే అనర్థాలు, గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రెంటచింతల రమణ, మహిళా పోలీసులు హైమావతి, సుశీల, సిహెచ్. నాగలక్ష్మి, జి. శ్రావణి పాల్గొన్నారు.

అదుపుతప్పిందా..పల్టీనే!

అధ్వానంగా చల్లపల్లి - నడకుదురు రోడ్డు



మేకావారిపాలెం వద్ద ప్రమాదకరంగా..

(చల్లపల్లి - ఆంధ్రజ్యోతి): చల్లపల్లి - నడకుదురు రోడ్డులో మేకావారిపాలెం వద్ద రోడు ప్రమాదకరంగా మారింది.గత ప్రభుత్వ హయాంలో రోజూ వందలాది టిప్పర్ల రాకపోకలతో రోడ్డు పలు చోట్ల దెబ్బతినగా, మేకావారిపాలెం వద్ద కుంగి పోయింది. ఆ ప్రదేశంలో రహదారి కుంగిపోయే పరిస్థితి గతంలోనూ ఉండేది కానీ, ఈ పర్యాయం టిప్పర్ల కారణంగా పలుచోట్ల రహదారి దెబ్బతినగా, మేకావారిపాలెం వద్ద ఎక్కువగా పాడైపోయింది. నడకుదురు రోడ్డు నిత్యంరద్దీగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల నుంచీ చల్లపల్లి వచ్చే ప్రజలంతా ఈ రహదారి మీదుగానే రావాల్సి ఉంది. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు తోడు కరకట్టమీదుగా విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రస్తుతం ఇసుక ట్రాక్టర్ల రాకపోకలతో రహదారి రద్దీగా మారింది. లంకతోట అడ్డరోడ్డు వరకూ వేగంగా వచ్చిన ఏ వాహనమైనా కొద్దిగా ముందుకు వచ్చిన తర్వాత ఒక్కసారిగా వేగం తగ్గించి జాగ్రత్తగా వాహనం నడపాల్సిందే. ఆదమరిచి వేగంగా ముందుకు వచ్చారో అదుపుతప్పిప్రమాదానికి గురికాక తప్పదు. మరోమారు ప్రమాదం సంభవించకముందే అధికారులుప్రమాదకరంగా మారిన కొద్దిభాగాన్ని అయినా మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



కుంగిన రహదారి

ప్రమాదకరంగా ప్రయాణం ..

రహదారి కుంగిపోవటంతో ఆ ప్రాంతంలో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. అదుపుతప్పితో వాహనాలు పల్టీకొట్టే ప్రమాదం ఉంది. ఎత్తుపల్లాలు సరిచేసి కంకర వేసి మళ్లీ తారుపోసి ప్యాచ్ వర్క్ పూర్తిచేస్తే ప్రయాణం ఇబ్బందిలేకుండా ఉంటుంది.

- వెంకటేష్, ఆటో డ్రైవర్

మరమ్మతులకు నిధులు మంజూరు

చల్లపల్లి - నడకుదురు రోడ్డు ప్యాచ్ వర్క్ కోసం రూ.15 లక్షలు నిధులు మంజూరైనట్లు ఆర్అండ్‌బీ డీఈఈ రమేష్ తెలిపారు. ఒకటవ కిలోమీటరు నుంచీ నాల్గవ కిలోమీటరు వరకు మరమ్మత్తులు చేయాల్సి ఉందనీ, టెండరు ద్వారా వచ్చే నెలలో పనులు చేస్తారని చెప్పారు.

- రమేష్, డీఈ



విజయానందతీర్థ పూజలు

ధర్మమార్గం అనుసరణీయం

విజయానందతీర్థ

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో చేసే పుణ్యకార్యాలు, దానాలు, ధర్మాలు, ఉపవాసాల వల్ల భగవదారాధన సులభతరమవు తుందని మైసూరు దత్తపీఠం ఉత్తర పీఠాధిపతి విజయానంద తీర్థ స్వామిజీ అన్నా రు. బుధవారం రాత్రి విజయానంద తీర్థ స్వామిజీ బుట్టాయిపే టలోని దత్తాశ్రమానికి విచ్చేశారు. స్వామిజీ కోటి లింగార్చనలో పాల్గొన్నారు. భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. ధర్మమార్గాన్ని అనుసరించిన వారికి సర్వత్రా విజయాలే సంప్రాప్తిస్తాయన్నారు. సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న కమలానందభారతీ

మోపిదేవి: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీస్వామిజీ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేయగా, అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం, నూతన వస్త్రాలతో సత్కరించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి. రవికుమార్ తెలిపారు. ఈడే పల్లిలోని గ్రంథాలయంలో నిర్వహించే వారోత్సవాల కరపత్రాలను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ ఆవిష్కరించారు. గ్రంథాలయ నిర్వాహకులు కోన వెంకటేశ్వరమ్మ, నాయకులు గంటా సతీష్, గనిపిశెట్టి గోపాల్, తూమాటి బసవశంకరరావు, నూకల శేషుబాబు పాల్గొన్నారు.

కోడూరు: కోడూరు గ్రంథాలయంలో నవంబరు 14 నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి వై.పుష్పవతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



బంటుమిల్లిలో రైతుల రిలే దీక్ష

నీటి కోసం సాగుతున్న దీక్షలు

బంటుమిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దాళ్వా పంటకు నీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని కృష్ణాజిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం 5వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, మలిశెట్టి శివరామ ప్రసాద్, అజయ్‌ఘోష్, సుజ్ఞానం జనార్దన్, వెంట్రపాటి సురేష్ జ్యోతిబాబు, లక్ష్మణస్వామి, నాగిశెట్టి వెంకన్న, నాని, అహ్మద్ ఖాన్, మహ్మద్ బషీర్, గౌరిశెట్టి వెంకటేశ్వరరావు, దూసనపూడి సుబ్బయ్య, బోసు, వంగల రాజు, మాజేటి శివశ్రీనివాసరావు తదిరులు పాల్గొన్నారు.

దాళ్వాకు సాగునీరందించాలి :సీపీఎం

మచిలీపట్నం టౌన్ : పెడన నియోజకవర్గంలోని బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన మండలాల్లో దాళ్వాకు సాగునీరందించాలని సీపీఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మచిలీపట్నంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మూడేళ్ల నుంచి దాళ్వా సాగుకు నీరివ్వాలని రైతులు అడుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.

పైపులైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ఘంటసాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): లంకపల్లిలో జలసిరి పథకం ద్వారా రూ.20 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారని, పైపులైన్‌కు నిధులు మంజూరు చేయాలని ఎంపీడీవో సుబ్బారావుకు బుధవారం టీడీపీ నేతలు వినతిపత్రం అందజేశారు. రాజ్యసభ మాజీ సభ్యులు కనకమేడల రవీంద్ర బాబు ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేయగా, ట్యాంక్ నిర్మాణం జరిగిందన్నారు. పైపులైన్ నిర్మాణానికి సుమారు 6 లక్షలు అవసరం ఉందని, జడ్పీ నిధులు నుంచి 2 లక్షల 30 వేలు మంజూరు చేశారని, మిగిలిన నగదును మండల పరిషత్ నిధుల నుంచి మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు పరిశె చలపతి, కె.లీలాకృష్ణ, వీరమాచినేని ప్రసాద్, తుమ్మల నందేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల్లో కళాకారుల పాత్ర ఎనలేనిది

చల్లపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఉద్యమాల్లో కళాకారుల పాత్ర ఎనలేనిది అని ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చియ్య అన్నారు. ప్రజానాట్య మండలి నాయకులు అడ్డాడ దుర్గానాగేశ్వరరావు రెండో వర్ధంతిని వక్కలగడ్డలో బుధవారం నిర్వహించారు. తొలుత నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోసూరు అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, హనుమానుల సురేంద్రనాద్ బెనర్జీ, రత్నకుమారి, సీతారామరాజు ప్రసంగించారు.



భవన నిర్మాణ కార్మికుల రాస్తారోకో

ఇసుకపై ఆంక్షలు తొలగించాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇసుకపై ఆంక్షలు తొలగించి కార్మికులకు పని కల్పించాలంటూ కృష్ణాజిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రుస్తుంబాద గాంధీ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు టి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు చిట్టిబొమ్మ వీర వెంకటేశ్వరరావు, ఎ. వెంకటేశ్వరరావు, కొంపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

అవనిగడ్డ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బుధవారం కార్తీక దీపోత్సవ కార్యక్రమం వైభవంగా జరి గింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు, భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీ స్వామి, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావులతో కలసి దీపోత్సవం ప్రారంభించగా, పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారి ఆలయంలో దీపాలు వెలిగించి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, గ్రామ ప్రముఖులు మత్తి శ్రీనివాసరావు, బీజేపీ నేత తుంగల వెంకట గిరి పాల్గొన్నారు.



కార్తీక దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న బుద్ధప్రసాద్ దంపతులు



సహస్ర లింగాలకు అభిషేకం చేస్తున్న పంతం గజేంద్ర

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నంలోని శివాలయాల్లో పరమశివునికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. చిలకలపూడి పాండురంగ స్వామి వారి ఆలయంలోని కోటి లింగాల మండపంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వయంగా శివలింగాలకు అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు, బీజేపీ నాయకుడు పంతం గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

ఘంటసాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొడాలి, తాడేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా.సుధారాణి, ఏవో కె.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పొలాల్లో మానిపండు తెగులు ఉధృతి గమనించటం జరిగిందని, నివారణకు గానూ ప్రొపికొనజోల్ 200 మిల్లీలీటర్లు ఒక ఎకరాకు చొప్పున మొక్క మొత్తం తడిచేలా పిచికారి చేసుకోవాలని తెలియ జేశారు. కొడాలి ఉప సర్పంచ్ తుమ్మల శంకరరావు, పీఏసీఎస్ మాజీ ఛైర్ పర్సన్ తాతినేని వెంకట కృష్ణారావు, కెవికె శాస్త్రవేత్త డా.నవీన్, వీఏఏ వి.వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

కోడూరు : కోడూరు మండలంలోని రామకృష్ణాపురం, హంసలదీవి, కోడూరు, ఉల్లిపాలెం గ్రామాల్లోని చౌడు భూముల వ్యవసాయ క్షేత్రాలను ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.ఎం.వెంకటలక్ష్మి, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.శ్రీధర్ బుధవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు నీలిమ, తులసీ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో అనుభవం అవసరం

మోపిదేవి: వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సలహాలు, సూచనలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పని అనుభవ కార్యక్రమంలో భాగంగా మోపిదేవి ప్రాథమిక పాఠశాలలో గ్రామ చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. రైతులతో కలసి శాస్త్రవేత్త గ్రామ చిత్రపటాన్ని పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు.

అంబేడ్కర్‌కు 104 ఉద్యోగుల వినతి

అవనిగడ్డ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీతాయిలంకలోని డా.వి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద వినతిపత్రాన్ని ఉంచి నిరసన వ్యక్తం చేశారు. 104 ఉద్యోగులు జి.నాంచారయ్య, పి.స్వాతి పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలి

అవనిగడ్డ రూరల్ : ఆర్టీసీ కాలనీలో రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం కన్వీనర్ మండలి వెంకటేశ్వరరావు బుధవారం రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావుకు వినతిపత్రం అందజేశారు. అవనిగడ్డలో ఆర్టీసీ కాలనీ ఏర్పడి దాదాపు దశాబ్ద కాలం గడుస్తుందని, అయితే ఇప్పటి వరకు రహదారుల నిర్మాణానికి నోచుకోలేదన్నారు.

విద్యార్థులకు టీషర్టులు..

అవనిగడ్డ, : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జీవిత కాల సభ్యులు బొండాడ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత డా.బొండాడ రామవేంద్రరావు సౌజన్యంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అవనిగడ్డ బ్రాంచ్ ఛైర్మన్ వంగర శేషగిరిరావు 20 టీ షర్టులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవనిగడ్డ జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ విభాగానికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.డి.ఉమారాణి బొండాడ రాఘవేంద్రరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

కళ్లజోళ్లు పంపిణీ..

చల్లపల్లి : ఎల్‌వీప్రసాద్ నేత్ర వైద్యవిజ్ఞాన సంస్థ గూడవల్లి బ్రాంచి వారి ఆధ్వర్యంలో 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి 160 మందిని కళ్లజోళ్లకు, 52 మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. పడమరవీధిలోని శ్రీరామలింగ చౌడేశ్వరి అమ్మవారి కళ్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో ఎల్.వి.ప్రసాద్ వైద్య సంస్థ రాష్ట్ర కో..ఆర్డినేటర్ వై.వెంకట్, సొసైటీ అధ్యక్షులు యడ్ల నారాయణరావు, మేనేజర్ బళ్ల జయప్రకాష్, కేతన సత్యనారాణలు కళ్లజోళ్లను పంపిణీ చేశారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

పెడన : లే అవుట్లలో త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎం.గోపాలరావు ఆదేశించారు. ఇళ్ల నిర్మా ణాల పురోగతిపై బుధవారం ఆయన తన చాంబర్‌లో వార్డు ఎమినిటీ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, డిసెంబరు 31 నాటికి లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల న్నారు.

జగన్‌తోనే నా ప్రయాణం

కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

అవనిగడ్డ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తాను పార్టీ మారుతున్నట్లు నియోజకవర్గంలో వస్తున్న వార్తల్లో ఏలాంటి వాస్తవం లేదని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. బుధవారం అవనిగడ్డ వైసీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యకర్తల సమావేశంలో సింహాద్రి రమేష్‌బాబు పార్టీ పరిస్థితి, నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై కార్యకర్తలతో మాట్లాడారు. తాను తెలుగుదేశంపార్టీలో చేరుతున్నట్లుగా పెద్ద ఎత్తున్న ప్రచారం జరిగిందని, ఇందులో ఎంత మాత్రం వాస్తవం లేదని, తన పయనం జగన్మోహన్ రెడ్డితోనే అనిసింహాద్రి రమేష్‌బాబు తెలిపారు.

నాడు దోపిడీ అన్నారు..

నాడు అధికారంలో ఉన్నప్పుడు ఎడ్ల బండ్లతో ఇసుక తీసుకెళ్తేనే దోపిడీ జరుగుతుందని పర్యావరణం దెబ్బతింటుందని ప్రస్తుత ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విమర్శించారని, ఇప్పుడు అవనిగడ్డ నియోజకవర్గంలో జరుగుతున్నది ఏమిటని ఆయన ప్రశ్నించారు. సమావేశాల్లో ఇసుక, బుసక అక్రమ రవాణా చేస్తే సహించబోనని ప్రకటించి ఇవతలకు రాగానే అక్కడ తెలుగుదేశం, జనసేన నేతలు ఇసుక, మట్టి రవాణాకు పాల్పడుతున్నారని, యథేచ్ఛగా జూదాలు నడుస్తున్నాయని సింహాద్రి రమేష్‌బాబు ఆరోపించారు. డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసును సీబీడీకి అప్పగించామని, ఆ కేసును వెంటనే తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీనేతలు కడవకొల్లు నరసింహారావు, తుంగల సుమతిదేవి, చింతలపూడి లక్ష్మీనారాయణ, వేమూరి వెంకట్రావు, తుమ్మల మురళీకృష్ణ, బసవయ్య, మాధవరావు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో కప్పలదొడ్డి జడ్పీ విద్యార్థుల ప్రతిభ

గూడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో జరిగిన అండర్-17 బాలుర విభాగం బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కప్పలదొడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. అండర్-17, అండర్-14 బాలికల విభాగంలో అన్న మయ్య జిల్లాలో జరిగిన పోటీల్లో నాలుగవ స్థానం సాధించిన విద్యార్థినులను బుధవారం అభినందించారు.సర్పంచ్ యక్కల మాధవి నాగరాజు, పేరిశెట్టి తేజస్వి, కట్టా మునీశ్వరరావు, భట్ట శివకృష్ణ, హెచ్ఎం జ్యోతి పాల్గొన్నారు.

ప్రజాపోరును జయప్రదం చేయాలి

కోడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం విశ్వనాథపల్లి గ్రామపార్టీ శాఖ కోరింది. విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, ఇసుక సక్రమంగా అమలు చేయాలని, త్యావసర ధరలు తగ్గించాలని, నిరుద్యోగ భృతి కల్పించాలని కోరారు. సభ్యులు కొప్పనాతి తాతయ్య, తోట శ్రీనివాసరావు, కొండవీటి వెంకట రామయ్య, పాల్గొన్నారు.